RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 319 మేడ్చల్ మల్కాజ్‌గిరి 10 డిసెంబర్ 2024 మంగళవారం పేజీలు : 4

### సరిహద్దుల్లో త్వరలో సమగ్ర డ్రోన్ విధ్వంసక వ్యవస్థ

జోధ్‌పూర్ : సరిహద్దుల్లో భద్రతను పటిష్ఠం చేసేందుకు త్వరలో సమగ్ర డ్రోన్ విధ్వంసక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ప్రకటించారు. రాజస్థాన్‌లో జోధ్‌పూర్ లోని బీఎసఎఫ్ ట్రైనింగ్ క్యాంప్‌లో నిర్వహించిన బీఎసఎ ఫ్ 60వ రైజింగ్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేజర్ యాంటీ డ్రోన్ గన్ మౌంటెడ్ మెకానిజం మంచి ఫలితాలు ఇచ్చిందని, దీని వల్ల పంజాబ్‌లో పాకిస్థాన్‌తో సరిహద్దు ప్రాంతంలో శత్రు డ్రోన్ల గుర్తింపు, కూల్చివేతలు 3 శాతం నుంచి 55 శాతానికి పెరిగాయని అన్నారు. రాబోయే రోజుల్లో శత్రువుల నుంచి డ్రోన్ల ముప్పు మరింత పెరగనుందని, దాన్ని ఎదుర్కొనేందుకు బీఎసఎఫలో సమగ్ర డ్రోన్ విధ్వంసక విభాగాన్ని తీసుకురానున్నట్లు అమిత్ షా వెల్లడించారు.




## తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేసిన ఈ రోజు (డిసెంబర్ 9)

# చరిత్రలో నిలిచిపోతుంది

### తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేసిన ఈ రోజు (డిసెంబర్ 9) చరిత్రలో నిలిచిపోతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి ఎన్నో ఏళ్లు అవహేళనకు గురైందని చెప్పారు. రాష్ట్ర సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రేవంత్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఉన్న రోజుల్లో అందరం 'టీజీ' అని రాసుకున్నామని, వాహనాలు, కార్యాలయాల మీద కూడా అదే రాసుకున్నామని చెప్పారు. కానీ, గత ప్రభుత్వం మాత్రం 'టీజీ' అక్షరాలు కాదని, టీఎస్ అని పెట్టి ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని మండిపడ్డారు. " ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 'టీఎస్'ను 'టీజీ'గా మార్చాం. ఉద్యమ రోజుల్లో ఎక్కడ విన్నా.. 'జయ జయహే తెలంగాణ' వినిపించేది. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ గీతానికి గౌరవం దక్కలేదు. అందుకే మేం 'జయజయహే తెలంగాణ'ను రాష్ట్ర గీతంగా ప్రకటించాం. పదేళ్లపాటు తెలంగాణ తల్లి వివక్షకు గురైంది. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమం వైపు నడిపిస్తున్నాం. ఎందరో కవులు, కళాకారులు ఉద్యమానికి వెన్నెముకగా నిలిచారు. తమ పాటలతో తెలంగాణ ఉద్యమాన్ని ఉర్రూతలూగించారు. వారిని గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉంది. మొత్తం 9 మంది తెలంగాణ కవులు, కళాకారులకు తెలంగాణ ప్రభుత్వం నజరానా ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీ, అమరవీరుల స్తూపం రూపశిల్పి ఎక్కా యాదగిరి, గోరటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, పాశం యాదగిరి, బండి యాదగిరి, గూడ అంజయ్య, గద్దర్, జయరాజ్ కుటుంబాలకు రూ.కోటి చొప్పున నగదు, 300 గజాల స్థలం బహుమానంగా ఇస్తున్నాం" అని రేవంత్ రెడ్డి తెలిపారు.

**తొలి ప్రకటన వచ్చింది ఈ రోజే: భట్టి విక్రమార్క...** డిసెంబర్ 9వ తేదీకి ఎంతో ప్రత్యేకత ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ ఇస్తున్నట్లు కేంద్రం నుంచి తొలి ప్రకటన డిసెంబర్ 9నే వచ్చిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నామని, కానీ, ఆ ఆకాంక్షలు మాత్రం గత పదేళ్లు నెరవేరలేదని చెప్పారు. "ప్రజలు తొమ్మిదిన్నరేళ్లు నిర్బంధాల మధ్య గడిపారు. రాష్ట్రాన్ని భారీ అప్పుల్లోకి నెట్టి అతలాకుతలం చేశారు. భారీ అప్పుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. మహిళలకు ఉచిత ఆర్టీస ప్రయాణం కల్పించాం.

రైతు రుణమాఫీ కింద రూ.21వేల కోట్లు ఇచ్చాం. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వాన్ని ఇచ్చారు. భారీ అప్పుల్లో ఉన్నా.. సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. పదేళ్లపాటు విద్యార్థుల డైట్ ఛార్జీలను గత ప్రభుత్వం పెంచలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత డైట్ ఛార్జీలను ఒకేసారి 40శాతం పెంచాం. గురుకులాలకు కూడా గత ప్రభుత్వం సరైన భవనాలు నిర్మించలేదు" అని భట్టి అన్నారు.

## మహిళలకు గుడ్ న్యూస్..

### ఎల్ఐసీ బీమా సఖి యోజన పథకాన్ని ప్రారంభించిన మోదీ



న్యూఢిల్లీ: మహిళా సాధికారత దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో కీలక పథకాన్ని అందుబాటులోకి తెచ్చారు. బీమా సఖి యోజన అనే పథకాన్ని హర్యానాలోని పానిపట్‌లో జరిగిన సోమవారంనాడు జరిగిన కార్యక్రమంలో ప్రధాని ప్రారంభించారు. దేశవ్యాప్తంగా లక్ష మందికి పైగా ఈ పథకం ద్వారా ఉపాధి లభించనుంది. 18 నుంచి 70 ఏళ్ల లోపు మహిళలు ఈ పథకం ద్వారా ఎల్ఐసీ ఏజెంట్లుగా ఉపాధి పొందుతారు. మహిళలలో అక్షరాస్యతా పెంపు, ఆర్థికంగా బలపడేందుకు ఈ పథకాన్ని ఉద్దేశించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాది, ఉద్యోగావకాశాలు కల్పించడం, స్థిరమైన ఆదాయం ఉండేలా చూడటం పథకం ముఖ్యోద్దేశం. మహిళా ప్రగతికి అవరోధమైన సామాజిక ఇబ్బందులను తొలగించడం ప్రధానోద్దేశంగా ఈ పథకం రూపొందినట్టు ప్రధాని తన ప్రసం గంలో తెలిపారు "గతంలో కొన్ని పనులను మహిళలకు అప్పగించే విషయంలో ఆటంకాలు ఎదురయ్యేవి. మన ఆడకూతుళ్లకు అ లాంటి అవరోధాలను తొలగించాలని బీజేపీ నిర్ణయించింది. ప్రతి రంగంలోనూ మహిళలు రాణించేలా చేసేందుకు కట్టుబడి ఉన్నాం. లింగ సమానత్వం, వివిధ రంగాల్లో మహిళా సాధికారతను మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు ఈ పథకాన్ని తీసుకువచ్చాం" అని చెప్పారు.

డిసెంబర్ 9వ తేదీన ఈ పథకాన్ని ప్రారంభించడానికి ఒక ప్రత్యేకత కూడా ఉందని, భారతీయ గ్రంథాలు తొమ్మిదో సంఖ్యను అత్యంత శుభప్రదంగా భావిస్తాయని, 9వ సంఖ్య దుర్గామాత శక్తికి తార్కాణమని, సాధికారత, శక్తికి సంకేతమని చెప్పారు. డిసెంబర్ 9వ తేదీనాడే రాజ్యాంగ సభ తొలి సమావేశం జరిగిందని చెప్పారు.



## వసతి గృహాల్లో సదుపాయాల కల్పన..

### రూ.5వేల కోట్లు కేటాయించాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్: నెలలో ఒక రోజు వసతి గృహాలకు వెళ్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సీఎంతో పాటు సభ్యులందరూ వసతి గృహాలను పరిశీలిస్తారని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో భట్టి విక్రమార్క ఇష్టాగోష్టిగా మాట్లాడారు. డిసెంబర్ నెల నుంచే హాస్టళ్లలో పర్యటిస్తామని.. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తామన్నారు.

వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పిస్తామన్నారు.
ఇందుకోసం రూ.5వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. గత పదేళ్లలో డైట్ ఛార్జీలు పెంచలేదని.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే డైట్ ఛార్జీలు పెంచినట్లు భట్టి తెలిపారు.

## అదానీ దొంగ అని రాహుల్ అంటే..

### రేవంతేమో అలాయ్ బలాయ్ చేసుకుంటడు : హరీశ్‌రావు



హైదరాబాద్ : అదానీ దొంగ అని, అవినీతి చేసిండని రాహుల్ గాంధీ తిడితే, రేవంత్ రెడ్డి ఇక్కడ చీకటి ఒప్పందాలు చేసుకుంటడు.. అలాయ్ బలాయ్ చేసుకుంటడు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. శాసనసభలోకి వెళ్లకుండా ప్రతిపక్ష నాయకులను అడ్డుకొని అరెస్టులు చేయడం పట్ల హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు. అదానీతో వేలకోట్ల రూపాయలు ఒప్పందాలు చేసుకుంటడు. ఇదెక్కడి న్యాయం. వివిధ మార్గాల్లో ప్రతిపక్షాలు నిరసనలు తెలియచేస్తుంటాయి. అడ్డుకోవడం దుర్మార్గం. అక్రమ సంబంధాలు, చీకటి ఒప్పందాలు బయట పడుతాయని ప్రతిపక్షాన్ని సభలోకి రాకుండా అడ్డుకుంటున్నారు. సభ ఏకపక్షంగా జరిపే ప్రయత్నం చేస్తున్నారు. అదానీతో చీకటి ఒప్పందం బయటపడిందని, మేము ప్రశ్నిస్తామని భయపడుతున్నరు అని హరీశ్‌రావు తెలిపారు.

మమ్మల్ని సభలోకి రాకుండా ఎందుకు ఆపుతున్నావు రేవంత్ రెడ్డి? పార్లమెంట్‌లో రాహుల్, ప్రియాంకలు అదానీ, మోడీ బాయి బాయి అనే స్లోగన్స్‌తో టీషర్ట్స్ వేసుకున్నరు. మేము ఇక్కడ అదే విధంగా మీ చీకటి ఒప్పందాన్ని ప్రశ్నిస్తే తప్పేంటి..? నువ్వు తప్పు చేసినవు కాబట్టే మేం ప్రశ్నిస్తామని మీరు భయపడుతున్నారని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

# ఎప్పుడు ఎన్నికలు వచ్చినా...

# వంద సీట్లు గెలుస్తాం..!



### కేసీఆర్ సీఎం కావడం ఖాయం : కేటీఆర్

మేడ్చల్ : తెలంగాణలో శాసనసభ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా 90–100 వంద సీట్లతో తిరిగి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మేడ్చల్ జిల్లాలో జరిగిన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నేను మీ అందరినీ ప్రార్థించేది ఒకటే.. ఈ సన్నాసులు ఎంత ప్రయత్నం చేసినా.. ఎంత బుకాయించే ప్రయత్నం చేసినా.. ఎన్ని రకాల పచ్చి అబద్ధాలను మార్కెట్‌లో మార్కెటింగ్ చేసినా.. ఊరంతా హెూర్డింగ్‌లు పెట్టి ఊదరగొట్టినా ఒకటి మాత్రం జరుగబోయేది పక్కా. రానున్న రోజుల్లో ఎన్నికలు శాసనసభకు ఎప్పుడు జరిగినా ఘంటాపథంగా చెబుతున్నా.. 90–100 సీట్లతో తిరిగి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం ఖాయం. నేను మీ అందరికీ మాట ఇస్తున్న. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన మొదటిరోజే.. మీరు మా తెలంగాణ తల్లి స్థానంలో పెట్టిన రాహుల్ గాంధీ తండ్రి విగ్రహాన్ని సకల మర్యాదలతో గాంధీ భవన్‌కు పంపడం ఖాయం' అన్నారు. అదే మాదిరిగా కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని పెట్టి.. తెలంగాణ అని నమ్మబలుకుతున్నరో.. ఏ కాంగ్రెస్ తల్లి అయితే భస్మాసుర హస్తం చూపుతూ.. అభయహస్తం అని చెప్పి మోసం చేసి ప్రయత్నం చేస్తున్నరో.. ఏ కాంగ్రెస్ తల్లి అరచేతిలో వైకుంఠం చూపెట్టి.. ఆరు గ్యారంటీలు అని.. 420 హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసి ఇవాళ సంవత్సరం తర్వాత క్షోభ పడేలా చేస్తున్నదో.. ఆ కాంగ్రెస్ తల్లిని కూడా సకల మర్యాదలతో మీ గాంధీభవన్‌కు పంపడమే ఖాయం ఖాయం. ఇది రాసిపెట్టుకో రేవంత్‌రెడ్డి అని చెబుతున్న. ఇవాళ ఏ ఒక్క కాంగ్రెస్ సన్నాసో.. చరిత్ర తెలియని మూరు?డో.. చరిత్రను మారుస్తా అని అనుకుంటే వాళ్ల అవివేకమవుతుంది. కానీ, మనం జాగ్రత్తగా ఉండకపోతే.. అప్రమత్తంగా ఉండాలి. సింహాలు తమగాథ తాము చెప్పుకోకపోతే.. వేటగాళ్లు చెప్పే పిట్టకథలే చరిత్రగా మారుతయని పెద్దలు చెబుతారు. వేటగాళ్ల క్రూరమైన పరిహాసం.. ఎవరైతే తెలంగాణలో పేదబిక్కితో ఆడుతున్నరో.. కాంగ్రెస్ సన్నాసులు చెప్పే మాటలు నిజం కావొద్దంటే.. ఎప్పటికప్పుడు తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని మేడ్చల్‌లో మా తమ్ముడు రాజు.. వివేక్ శ్రమ తీసుకొని మిమ్మల్ని అందరికీ ఒకచోటకు తెచ్చి శోభాయమానంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని. అదే పద్ధతుల్లో రాష్ట్రమంతా కార్యక్రమాలు చేద్దాం' కేటీఆర్ పిలుపునిచ్చారు.

**ఇందిరమ్మ రాజ్యమంటే అణచివేతలు.. అక్రమ అరెస్టులేనా?: కేటీఆర్...** తెలంగాణ తల్లులపై ఏంటీ దుర్మార్గం? ఆశా వర్కర్లు మీకు తల్లుల్లా కనిపించడం లేదా? అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు.

తమ డిమాండ్ల సాధన కోసం ఆశా వర్కర్లు హైదరాబాద్‌లో చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారీ తీసిన విషయం తెలిసిందే. ఆందోళన చేస్తున్న ఆశాలను పోలీసులు అడ్డుకోవడంతో వారి మధ్య స్వల్ప వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. దీనిపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. "మాతృ మూర్తులపై పురుష పోలీసులతో దౌర్జన్యమా? ఏం పాపం చేశారని ఆశా వర్కర్లను రోడ్డుపై లాగిపారేశారు?ఇందిరమ్మ రాజ్యం అంటే అణచివేతలు, అక్రమ అరెస్టులేనా? ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి. లేకపోతే వారి ఆగ్రహ జ్వాలలను తట్టుకోలేరు" అని హెచ్చరించారు.

# సంపాదకీయం

## పవన్ రాజకీయం నేర్చుకుంటున్నారా ?

అదేంటి పవన్ కి రాజకీయాల్లో ఎంతో అనుభవం ఉంది కదా. ఆయన 2008లోనే ప్రజారాజ్యం పార్టీలో యువ రాజ్యం అధినేతగా కీలకంగా వ్యవహరించారు కదా అని అనొచ్చు. ఆయన మొత్తం రాజకీయ జీవితం 15 ఏళ్ళు పై మాటగా ఉందని ఆయన వరసగా నాలుగు సాధారణ ఎన్నికలను కూడా చూశారు అని కూడా చెప్పేవారు ఉన్నారు. ఇక పొత్తులు ఎత్తులు వ్యూహాలు ప్రతి వ్యూహాలలో పవన్ ఎంతలా పండిపోయారన్నది కూడా అంతా బాగా విశ్లేషించి చెబుతారు. 2024 ఎన్నికలే అందుకు ఉదాహరణగా చూపిస్తారు. అటువంటి పవన్ ఇంకా రాజకీయాలు నేర్చుకుంటున్నారా అంటే అవును అనే ప్రచారం సాగుతోంది. అయితే పవన్ ఇపుడు నేర్చుకుంటున్నది ట్రెడిషనల్ పాలిటిక్స్ గురించి. పవన్ పార్టీ పెట్టినప్పుడు నూతన ఒరవడితో రాజకీయాలు చేస్తామని ప్రకటించారు. అయితే అవి మిగిల్చిన చేదు అనుభవాలు ఆయన 2019 ఎన్నికల్లో చూశారు. అందుకే 2024 ఎన్నికలకు వచ్చేసరికి ఆయన తన రాజకీయ పంథాను మార్చుకున్నారు. నాడు విమర్శించిన టీడీపీ బీజేపీలతోనే పొత్తు కలిపి ముందుకు సాగడం ఆయనలో వచిన గుణాత్మకమైన మార్పు అని చెబుతారు. ఇక పవన్ తాను విశ్వ నరుడిని అని తాను అన్ని వర్గాల ప్రతినిధి అని తనకు పరిధిలు పరిమితులు లేవని కూడా అనేక సార్లు చెప్పారు. కానీ 2024 ఎన్నికల్లో ఆయన పార్టీ గెలవడానికి కారణం సామాజిక బలం అన్నది చాలా మందికి అర్థం అయిన విషయమే. ముఖ్యంగా గోదావరి జిల్లాలు విశాఖ వంటి చోట్ల జనసేనకు అనుకూల విజయాలు దక్కడం వెనక బలమైన సామాజిక వర్గం ఆ పార్టీని సొంతం చేసుకోవడమే అని కూడా విశ్లేషిస్తూంటారు. కోస్తా జిల్లాలలో జనసేన ప్రభావం అంతకంతకు పెరుగుతోంది. దానికి కారణం కాపులు ఆ పార్టీకి వెన్ను దన్నుగా ఉండడమే. ఇందులో తప్పు ఏమీ లేదు. మిగిలిన పార్టీలకు కూడా ఆయా సామాజిక వర్గాలు దన్నుగా ఉన్నపుడు జనసేనకు ఎందుకు కాకూడదు అని కూడా అంటారు. అయితే పవన్ కూడా ఇపుడు అదే వైఖరిలో ఉంటూ తన పంథాను కొంత మార్చుకున్నారు అని అంటున్నారు. కోస్తాలో జనసేన నెమ్మదిగా బలపడుతోంది. ఇక చూడాల్సింది రాయలసీమ వైపు అన్నది ఆయన కొద్ది నెలల క్రితమే ఆలోచించారు అని అంటున్నారు. అందుకే ఆయన ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించగానే ఏపీవ్యాప్తంగా గ్రామ సభలు ఒకే రోజున నిర్వహించాలని తన పంచాయతీ రాజ్ శాఖ ద్వారా పిలుపు ఇచ్చారు. అలా ఆయన రైల్వే కోడూరు నియోజకవర్గం వెళ్ళి అక్కడ గ్రామ సభలో పాలు పంచుకున్నారు. ఆ విధంగా ఆయన సీమలో జనసేన ఉనికి బలంగా చాటే ప్రయత్నం చేశారు అని అంటున్నారు. ఇపుడు చూస్తే మెగా టీచర్స్ అండ్ పేరెంట్స్ మీటింగ్ కోసం ఆయన కడపను ఎంచుకున్నారు. సీమలో బలిజలు ఎక్కువగా ఉన్నారు. వారు చాలా అసెంబ్లీ నియోజకవర్గాలలో ప్రభావం చూపిస్తారు అని చెబుతారు. ముఖ్యంగా కడప, రాజంపేట, రైల్వే కోడూరు, రాయచోటి నియోజకవర్గాలలో బలిజలు బలంగా ఉన్నారు. వారే గెలుపోటములుని నిర్ణయిస్తూంటారు. ఈ సామాజిక వర్గం మొదటి నుంచి టీడీపీకి అండగా ఉంటోంది. వారిని తమ వైపునకు తిప్పుకునేందుకు పవన్ రాయలసీమ మీద ఫోకస్ పెడుతున్నారు అని అంటున్నారు. ఈ విధంగా చేయడం ద్వారా రానున్న కాలంలో రాయలసీమలో జనసేన మరింతగా పటిష్టం చేసుకోవాలని చూస్తున్నారు అని అంటున్నారు. ఇక కుల రహిత రాజకీయం అని పవన్ మొదట్లో చెప్పినా రాజకీయాల్లో అయితే కులం పాత్ర కీలకం అవుతొంది. పైగా జనసేన విజయాల వెనక కూడా అది గట్టిగా పనిచేస్తోంది అని అంటున్నారు. అందుకే పవన్ కూడా తన ఆలోచనలను ఆ దిశగా మార్చుకుంటున్నారా అన్న చర్చ వస్తోంది. రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలలో అత్యధిక సంఖ్యలో ఉన్న బలిజలను కనుక జనసేన వైపు తిప్పుకుంటే తన రాజకీయనికి తిరుగు ఉండదని పవన్ భావిస్తున్నారని అంటున్నారు. ఏది ఏమైనా పవన్ ట్రెడిషనల్ మార్క్ పాలిటిక్స్ ని నేర్చుకుంటున్నారా అన్న చర్చ అయితే సాగుతోంది. ఎవరెన్ని చెప్పినా ఈ దేశంలో కులాల పాత్ర రాజకీయాలో అతి ముఖ్యం. అందువల్ల జనసేనాని కూడా తన రధాన్ని ఆ వైపుగా నడిపిస్తున్నారు అని అంటున్నారు.

## ప్రతిపాదనలు ఘనం.. ప్రగతి గగనం



పెద్దపల్లి :పురపాలక, నగరపాలక బడ్జెట్ కేటాయింపులకు, నిధుల విడుదలకు పొంతన ఉండటం లేదు. ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం లేకపోవడం, సాధారణ నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తుండటంతో అభివృద్ధికి అవరోధంగా మారింది. ఆర్థిక సంస్థల నిధుల లభ్యత అంతంత మాత్రంగానే ఉండటంతో నిర్వహణ భారమైంది. బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఆదాయం సమకూరకపోవడం, ఆస్తి పన్ను వసూళ్లలో ఇబ్బందులు తదితర సమస్యలతో పాటు ప్రభుత్వ గ్రాంట్లు కూడా సకాలంలో రావడం లేదు.

పెద్దపల్లి పట్టణంలో పలు అభివృద్ధి పనులు నిధుల కొరతతో నిలిచిపోయాయి. బంధంపల్లిలో వైకుంఠధామం నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోగా, నిట్టూరు రోడ్డులోని మరో వైకుంఠధామానికి రూ.కోటి నిధులు విడుదలైనప్పటికీ పనులు మొదలు కాలేదు. రూ.2.75 కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్ సముదాయ నిర్మాణం కూడా అసంపూర్తిగా నిలిచింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన పనులు నిధుల కొరతతో రద్దయ్యాయి.

**నిధుల మళ్లింపు**

అసలే నిధుల కొరత వెంటాడుతుండగా పురపాలిక భవనానికి సామర్థ్యానికి మించి నిధులు వెచ్చించడం గుదిబండగా మారింది. 2013లో రూ.2 కోట్ల అంచనాతో భూమిపూజ నిర్వహించారు. అనంతరం 2017లో అంచనా వ్యయం పెంచి రూ.3.50 కోట్లతో మరోసారి శంకుస్థాపన చేశారు. రెండు సార్లు ఇద్దరు మంత్రుల చేతుల మీదుగా శిలాఫలకాలు ఆవిష్కరించారు. నిర్మాణానికి కేవలం రూ.21 లక్షలు మాత్రమే విడుదల కాగా వ్యయం రూ.5 కోట్లకు పెరిగింది. గుత్తేదార్లకు రూ.2 కోట్ల వరకు చెల్లించాల్సి ఉండగా మిగతా సొమ్మును సాధారణ, ఎల్ఆర్ఎస్ నిధుల నుంచి వెచ్చించారు.

**పెండింగ్ బిల్లులు.. రూ.77.36 లక్షలు**

సుల్తానాబాద్: సుల్తానాబాద్ పురపాలక సంఘానికి వివిధ పన్నుల ద్వారా ఏటా దాదాపు రూ.92.15 లక్షల ఆదాయం సమకూరుతోంది. బడ్జెట్ ప్రతిపాదనల మేరకు ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా రూ.5 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులు, పట్టణ ప్రగతి కింద రూ.19.30 లక్షలు, అమృత్ రూ.18.40 కోట్లు, ఎస్‌డీఎఫ్ రూ.10 లక్షలు రావాల్సి ఉంది. నిధులు మంజూరు కాక పట్టణ ప్రగతి, ఎస్‌డీఎఫ్ పనులు నిలిచిపోయాయి. చేసిన పనులకు సంబంధించి గుత్తేదార్లకు రూ.77.36 లక్షలు చెల్లించాల్సి ఉంది.

**నగరపాలిక ఆదాయం నిర్వహణకే సరి**

రామగుండం నగరపాలక ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ నిధులు విడుదల కాకపోవడంతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఇందులో రెండు సమీకృత మార్కెట్ భవనాలు, సామాజిక భవనాలు, అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం, బహుళ ప్రయోజనకర భవనం తదితర నిర్మాణాలున్నాయి. ఒక్కొక్క భవనానికి రూ.కోటి నుంచి రూ.8 కోట్ల వరకు మంజూరు చేశారు. రూ.కోటికి పైగా వెచ్చించి పనులు చేసినా బిల్లులు రాకపోవడంతో గుత్తేదార్లు పనులు వదిలేశారు. నగరపాలిక నిధులతో చేపట్టిన పనులకు కూడా బిల్లులు రావడం లేదు. నగరంలో దాదాపు రూ.8 కోట్ల వరకు బకాయిలున్నాయి. వివిధ రకాల పన్నులతో వచ్చే సాధారణ ఆదాయం ఒప్పంద కార్మికుల వేతనాలు, నగరపాలిక నిర్వహణకే సరిపోతోంది. ఇప్పటికే పనులు నిలిచిపోగా కొత్తగా అభివృద్ధి పనులను ప్రకటిస్తూ, ప్రారంభించడం గమనార్హం.

## శిక్షణ పొంది.. కొలువు కొట్టి



కరీంనగర్ : విద్యార్థులకు పాఠాలతోపాటు.. నైతిక విలువలు నేర్పే ఉపాధ్యాయ కొలువు సాధించాలనుకునే వారికి ప్రభుత్వ బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళ్లు బాటలు వేశాయి. ఆఫ్‌లైన్‌తోపాటు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వడంతో డీఎస్సీ అభ్యర్థులకు ఎంతో ఉపయోగంగా మారింది. ఇంటిని.. పనులను చూసుకుంటూ చదివారు. పలువురు ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో మెరిశారు. శిక్షణ కేంద్రాలు అందుబాటులో లేని వారు.. గ్రామీణ అభ్యర్థులు.. తర్ఫీదుకు రుసుం చెల్లించలేని వారికి ఈ స్టడీ సర్కిళ్లు నిచ్చెనల నిలిచాయి.

**ఆన్‌లైన్‌లో కూడా..**

కరీంనగర్‌లోని బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళ్లలో డీఎస్సీ-2024 కోసం ప్రత్యేకంగా పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల జిల్లాల అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చారు. ఆఫ్‌లైన్‌తోపాటు ఆన్‌లైన్ ద్వారా దాదాపు మూడు నెలల వరకు శిక్షణ అందించారు. స్టడీ మెటీరియల్, వివిధ రకాల పుస్తకాలు, నిపుణులతో తరగతులు చెప్పించారు. బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన 17 మంది, ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన 12 మంది ఉద్యోగాలు సాధించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సన్నద్ధత కరీంనగర్‌కు చెందిన రహీమొద్దీన్, ఫర్జానాల కుమారుడు ఎండీ అఫ్రోజ్ సాంఘిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. ఎస్జీటీగా చేస్తున్న తమ్ముడి సహకారం, నాన్న టైలర్‌గా పడుతున్న కష్టాన్ని చూసి ఎలాగైనా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలని.. బీసీ స్టడీ సర్కిల్‌లో మూడు నెలలు శిక్షణ పొందాడు. ఇక్కడి గ్రంథాలయంలోని పుస్తకాలు, సన్నద్ధత ఉద్యోగ సాధనకు తోడ్పడ్డాయని ఆయన పేర్కొన్నారు. స్టడీ సర్కిల్‌లో సమకూర్చిన భోజనంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడే ఉంటూ సన్నద్ధమయ్యానని చెప్పారు.

**ఏడాది కష్ట ఫలితం**

రాయికల్‌కు చెందిన బుర్ర శ్రీకాంత్ తండ్రి బాల్యంలోనే మరణించగా.. తల్లి రాజేశ్వరి బీడీలు చుడుతూ చదివించింది. పేద కుటుంబం కావడంతో శ్రీకాంత్ ప్రభుత్వ విద్యాసంస్థలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఉపాధ్యాయ కొలువు కొట్టి అమ్మకు అండగా నిలవాలనే సంకల్పంతో డీఎస్సీకి బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఆన్‌లైన్‌లో సన్నద్ధమయ్యారు. మాదిరి పరీక్షల ద్వారా సామర్థ్యాలను అంచనా వేసుకుంటూ.. ఏడాది పాటు కష్టపడ్డాడు. చివరికి స్కూల్ అసిస్టెంట్(బయోసైన్స్)గా ఎంపికై కష్టానికి తగ్గ ఫలితం పొందారు.

**నాన్న కల నెరవేరింది శిరీష**

జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన శిరీష తండ్రి శేఖర్ కార్పెంటర్, తల్లి కవిత బీడీ కార్మికురాలు. శేఖర్ కూతురుని టీచర్‌గా చూడాలని శిరీషను బీఈడీ చేయించారు. ఇందుకు అనుగుణంగానే కష్టపడి బీఈడీ పూర్తి చేసిన శిరీష.. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా డీఎస్సీకి ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకుంది. శిక్షణకు తోడు స్వతహాగా సన్నద్ధమై ఎస్జీటీగా ఎంపికైంది. ఇందుకు భర్త సహకారం కూడా తోడైందని ఆమె చెప్పింది.

**అవగాహన పెంచుకొని..**

శంకరపట్నం మండలం కేశవపట్నంకు చెందిన జూల వేణుగోపాల్ తండ్రి శ్రీనివాస్ హమాలీ, తల్లి వెంకటలక్ష్మి వ్యవసాయ కూలీ. పేదకుటుంబం కావడంతో విద్యాభ్యాసమంతా ప్రభుత్వ విద్యాసంస్థల్లో సాగింది. ప్రైవేటు విద్యాసంస్థలో బీఈడీ చేసిన అనంతరం ఎస్సీ స్టడీ సర్కిల్‌లో వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకున్నారు. డీఎస్సీకి కూడా శిక్షణ పొందారు. తోటి అభ్యర్థులతో శిక్షణలో పాల్గొనడం ద్వారా ఎలా సన్నద్ధమవ్వాలనే విషయంపై అవగాహన పెంచుకుని స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యానని వేణుగోపాల్ తెలిపారు.

## ఆహ్లాదం దరిచేరేలా.. ఆనందం పంచేలా..

పరిగి : నేడు మనిషి జీవనం యాంత్రికంగా మారింది. ఉదయం లేచింది మొదలు నిద్రపోయే వరకు ఒకటే పరుగు.. కనీసం వారాంతాల్లోనైనా కుటుంబంతో ఆహ్లాదంగా గడిపేందుకు వసతులు లేవు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు అడవులను చరవాణుల్లో చూపుతున్నారు. ఇవన్నీ కళ్లముందు సహజసిద్ధంగా సాక్షాత్కరిస్తే అద్భుతంగా ఉంటుంది కదూ. అర్బన్ పార్కుల ఏర్పాటుతో వీటిని ప్రారంభించేందుకు అటవీశాఖ కార్యాచరణ చేపట్టింది. జిల్లా వాసులకు ఆహ్లాదాన్ని అందించేందుకు ఇవి అందుబాటులోకి రానున్నాయి. హెచ్ఎండీఎలోని అర్బన్ ఫారెస్ట్రీ విభాగం, నగర్వన్ యోజన పథకం కింద అటవీశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. క్షేత్రస్థాయిలో ఇప్పటికే పనులు ప్రారంభించిన అధికారులు వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఒక్కో పార్కుకు రూ.2కోట్ల చొప్పున మంజూరయ్యాయి. వ్యవసాయ ప్రాంతంగా ఉన్న జిల్లాను అభివృద్ధి చేసేందుకు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు ఇందుకు వినియోగిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో వనరుల సద్వినియోగానికి పోటీపడుతున్నారు.

**ఎక్కడెక్కడ అంటే..:** పరిగి మండలం జాఫర్‌పల్లి రిజర్వు ఫారెస్టులో 50హెక్టార్లు, కొడంగల్ పరిధి అప్పాయిపల్లిలో 180 హెక్టార్లు, వికారాబాద్ అనంతగిరిలో 80హెక్టార్ల చొప్పున ఏర్పాటు కానున్నాయి. వీటితో పాటు తాండూరులోని గొల్లపల్లిలో గతేడాది మంజూరైన పార్కు పనులు ఇప్పటికే 20శాతం పూర్తయ్యాయి. మిగతా ప్రాంతాల్లోనూ పార్కుల ఏర్పాటులో భాగంగా మొక్కల పెంపకం పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి.

వసతులు ఇలా: జాఫర్‌పల్లిలో 3.5 కి.మీ దూరం, అప్పాయిపల్లిలో 6కి.మీ, అనంతగిరిలో 6కి.మీ తాండూరులో 4కి.మీ చొప్పున పాదచారులను ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేయనున్నారు. శౌచాలయాలు, తాగునీరు, సందర్శకులు అడవి





అందాలను ఆస్వాదించేందుకు వాచ్‌టవర్లు, వాహనాల పార్కింగ్, కూర్చునేందుకు బెంచీలు, సైన్‌బోర్డులు, అక్కడక్కడా పర్కులేషన్ ట్యాంకులు, చెక్‌డ్యాంల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వాటికి రక్షణ కల్పిస్తారు.

**సహజ వాతావరణాన్ని కల్పిస్తాం-జ్ఞానేశ్వర్, జిల్లా అటవీ అధికారి**

అర్బన్ పార్కుల్లో సహజ వాతావరణం ఉట్టి పడే విధంగా తీర్చిదిద్దుతాం. ప్రజాప్రతినిధుల సహకారంతో ఐదు ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయి. ప్రజలను ఆకట్టుకునే విధంగా వివిధ రకాల సదుపాయాలను కల్పిస్తాం. యాంత్రిక జీవనానికి దూరంగా పెద్దలు, పిల్లలు ఉండే విధంగా మనసుకు ఉల్లాసాన్ని, ఉత్తేజాన్ని కలిగించే విధంగా కృషి చేస్తున్నాం.

## ఉపాధి వేట ..ముళ్ల బాట

జగిత్యాల : జిల్లా మేడిపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన వినోద్ ఉపాధి కోసం బెహరాన్ వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా కంపెనీ నుంచి బయటకు వచ్చాడు. అక్కడ ఎవరూ సహకరించకపోవడంతో పాటు గుర్తుతెలియని వారు దాడి చేయడంతో చేయి విరిగింది. అక్కడే అనారోగ్యం పాలై మానవతావాదుల సాయంతో ఇల్లు చేరాడు. రోజురోజుకూ ఆరోగ్యం మరింత క్షీణించి రెండ్రోజుల కిందట మృతిచెందాడు. వినోద్ లాగే చాలా మంది అభాగ్యులు కంపెనీ నిబంధనలు పాటించకుండా చిక్కుల్లో పడుతున్నారు. ఇబ్బందులు ఎదురయ్యాక తమకు సాయం చేసేవారు లేరంటూ ఆవేదన చెందుతున్నారు.

సాంకేతికంగా అభివృద్ధి పెరుగుతున్నా గల్ఫ్ దేశాలకు వెళ్లాలనుకునే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. వీసాలు, వైద్య పరీక్షల పేరిట నకిలీ ఏజెంట్లు మోసం చేస్తూనే ఉన్నారు. ఇటీవల బాధితుల సంఖ్య పెరగడంతో జగిత్యాలలో పోలీసుశాఖ, వలసదారుల రక్షణ అధికారి(ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్), భారత విదేశాంగ శాఖ వారు అవగాహన, శిక్షణ ఏర్పాటు చేశారు. నకిలీల బారిన పడొద్దని, ఎలాంటి మోసం జరిగినా తమకు ఫిర్యాదు చేయాలని పోలీసులు చెబుతున్నారు. ఆర్మూరుకు చెందిన ఓ ఏజెంటు వైద్య పరీక్షలు చేయించి పలువురిని దుబాయి పంపగా అవి చెల్లవని చెప్పడంతో ఆర్మూరు, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన పలువురు తాము మోసపోయామని గుర్తించి లబోదిబోమన్నారు. గల్ఫ్ వెళ్లేవారికి అక్కడి కంపెనీల నిబంధనల మేరకు వైద్య పరీక్షలు చేయించాల్సి ఉండగా చాలా మంది ఏజెంట్లు తమకు అనుకూలమైన డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో పరీక్షలు చేయించి పంపుతున్నారు. కొందరు వైద్య పరీక్షలు చేయించుకోకుండా అక్కడికి వెళ్లి తీరా కంపెనీలు పరీక్షలు చేయించడంతో అనారోగ్య సమస్యలు బయటపడి స్వగ్రామాలకు తిరిగి వస్తున్నారు.

ఫిర్యాదులకు అవకాశం

జగిత్యాలలో పోలీసులు నిర్వహించిన అవగాహన సమావేశంలో రాయబార కార్యాలయ అధికారులు కూడా ఉండటంతో పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా లైసెన్స్ కలిగిన ఏజెంట్ల ద్వారా గల్ఫ్ దేశాలకు వెళ్తే అక్కడి కంపెనీల్లో సదరు ఏజెంటు చెప్పిన జీతభత్యాలు, ఉపాధి లేకపోతే భారత రాయబార కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే ఏజెంట్‌పై చర్యలు తీసుకునే అవకాశముంది. కేంద్ర ప్రభుత్వం కూడా నకిలీలు, కంపెనీలపై వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తోంది. జగిత్యాల జిల్లాకు చెందిన ఓ వ్యక్తి దుబాయిలో రోడ్డు ప్రమాదంలో గాయపడగా కంపెనీ యాజమాన్యం పట్టించుకోక పోవడంతో గల్ఫ్ సంక్షేమ సంఘాల సహకారంతో కంపెనీపై ఫిర్యాదు చేశాడు. దీంతో కంపెనీ వారు నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చింది.

నకిలీలతో ఇబ్బందులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలో లైసెన్స్ కలిగిన ఏజెంట్లు 33 మంది మాత్రమే ఉన్నారు. గల్ఫ్ ఏజెంట్లు ఇమ్మిగ్రేషన్ చట్టం 1983 నిబంధనలకు లోబడి పనిచేయాలని పోలీసులు పేర్కొంటున్నారు. అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించే కంపెనీల వివరాలు, జీతభత్యాలు ఏజెంట్లు తెలపాలని సూచిస్తున్నారు. గల్ఫ్ వెళ్లాలనుకుంటున్న వారు అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నంబర్ 1800113090 74283 21144ను సంప్రదించాలని చెబుతున్నారు. సరైన ధ్రువపత్రాలు పరిశీలించి అభ్యర్థులను గల్ఫ్ దేశాలకు పంపాలని పోలీసులు వివరించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి లైసెన్స్ పొందాలని, ఏమైనా ఫిర్యాదులు వస్తే ఏజెంట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

బాధితులు సంప్రదిస్తే చర్యలు

గల్ఫ్ లాంటి దేశాలకు వెళ్లేవారు మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నకిలీ ఏజెంట్ల బారిన పడి మోసపోవద్దు. బాధితులు నేరుగా సమీపంలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలువురు నకిలీ ఏజెంట్లపై కేసులు కూడా నమోదు చేశాం. అత్యవసర సమయాల్లో టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే సాయం అందుతుంది. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నాం. ఆన్‌లైన్‌లోని సమగ్ర సమాచారాన్ని పరిశీలిస్తే మోసాల నుంచి తప్పించుకోవచ్చు.- అశోక్‌కుమార్, ఎస్పీ, జగిత్యాల

## ప్రాథమిక విద్య.. వారికి మిథ్య

ఆసిఫాబాద్ : మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా అసలే అంతంత మాత్రంగా నడిచే గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లడం, మరొకరు అక్కడికి రాకపోవడంతో బడులన్నీ మూతపడ్డాయి. ఈ ఏకోపాధ్యాయ పాఠశాలలకు చాలాచోట్ల ఉపాధ్యాయుల హాజరు అత్యంత తక్కువగా ఉంటుంది. వీరిని పర్యవేక్షించేందుకు అన్ని మండలాల పరిధిలో ఎస్ఆర్పీ (స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్)లను నియమించారు. కొందరు ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న ఎస్ఆర్పీలను కొన్ని చోట్ల మారుమూల ప్రాంతాల్లో తమకు అనుకూలంగా మలుచుకుని పాఠశాలలకు వెళ్లడం లేదు. ఈ నేపథ్యంలో పల్లెల్లో పాఠశాలలు రోజుల తరబడి మూతపడే ఉంటున్నాయి.

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం బాబేఝరి పంచాయతీలోని చిత్తగూడ ప్రాథమిక పాఠశాల ఇది. ఇక్కడ 18 మంది విద్యార్థులు ఉన్నారు. పక్షం రోజుల నుంచి ఉపాధ్యాయుడు లేకపోవడంతో చిన్నారులు పాఠశాలకు వచ్చి వెళ్లిపోతున్నారు.

ఇంద్రవెల్లి మండలంలోని పొల్లుగూడ ప్రాథమిక పాఠశాలలో 12 మంది విద్యార్థులు ఉండగా.. ఇక్కడ ఉపాధ్యాయుడు లేరు. సిరికొండ మండలంలోని లక్ష్మీపూర్ పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి సైతం ఉపాధ్యాయుడు లేక మూతపడే ఉంటుంది.

గోవెన గొండుగూడ పాఠశాల

కుమురం భీం జిల్లా తిర్యాణి మండలంలో జెండగూడ, బొజ్జుగూడ, గోపెర, నాగగూడ గోపెర, గోవెన గోండుగూడ, కుర్సిగూడ, పాడిగూడ, కుంటగూడ, తాళ్లపేటగూడ, అర్జున్‌లొద్ది గ్రామాల్లో పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం ఆరంభం నుంచి తెరుచుకోవడం లేదు.

43 పాఠశాలల మూత' కథనం ప్రచురితం కాగా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా స్పందించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఐటీడీఏ అధికారులతో ఉట్నూర్‌లో సమావేశం నిర్వహించారు. బదిలీ అయిన చోట, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ప్రాంతాల్లోని పాఠశాలల వివరాలను సేకరించి, ఆయా ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే సీఆర్పీలను వెంటనే సర్దుబాటు చేయాలని ఆయా జిల్లాల గిరిజన సంక్షేమాధికారులను ఆదేశించారు.సర్దుబాటుతోపాటు విద్యను అందించాలి

మూతపడిన పాఠశాలలకు వారం అనంతరం ఉపాధ్యాయులు వెళతారని అధికారులు అంటున్నారు. సర్దుబాటు చేసిన వారితోపాటు, మిగతా ఏకోపాధ్యాయ పాఠశాలలు సక్రమంగా నిత్యం తెరుచుకునే విధంగా ఐటీడీఏ అధికారులు చూడాలని గిరిజనులు కోరుతున్నారు. వీటి పర్యవేక్షణ కోసం నియమించిన సీఆర్పీల ద్వారా పక్కాగా నివేదికలు అందేలా చూడాలి.

## తప్పుచేసినా.. తప్పించేలా

హైదరాబాద్ : రాష్ట్ర రాజధాని నగరంలో ఓ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినిని లైంగికంగా వేధించిన కీచక టీచర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు ఆ ఉపాధ్యాయుడిని జైలుకు పంపించిన ఎనిమిది రోజుల తర్వాత తాపీగా విద్యాశాఖ అధికారులు అతడిపై వేటు వేశారు. ముషీరాబాద్ మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ముషీరాబాద్ మండలంలోని సర్కారు బడిలో చదువుకుంటున్న ఒక విద్యార్థినితో ఉపాధ్యాయుడు సురేష్ అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా లైంగికంగా వేధించాడు. వేధింపులు భరించలేని బాలిక నవంబరు 27న తల్లికి చెప్పగా ఆమె ఫిర్యాదుతో దోమల్‌గూడ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి అదేరోజు సురేష్‌ను అరెస్ట్



చేశారు. అరెస్ట్ విషయం తెలిసినా మండలస్థాయి విద్యాశాఖ అధికారులు విషయాన్ని గోప్యంగా ఉంచడంతో వరకూ సురేష్‌పై చర్యలు చేపట్టలేదు. చివరికి విషయం తెలిసి జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి జి.సురేష్‌ను సస్పెండ్ చేశారు.

**పలుమార్లు వేధింపులు..** సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సురేష్ బాధిత బాలికతో పలుమార్లు అసభ్యంగా ప్రవర్తించగా ఓ రోజు ఆ బాలిక తల్లికి చెప్పింది. ఆమె పాఠశాల ఉపాధ్యాయులకు జరిగిన విషయాన్ని వివరించారు. ఉపాధ్యాయులు బాలికను ఆసుపత్రికి తరలించి వైద్యులు పరీక్షించారు. వారే పోలీసులకు సమాచారమివ్వడంతో కేసు నమోదయింది. ఆ టీచర్ గతంలోనూ పలువురు విద్యార్థినులను లైంగికంగా వేధించారని తెలుస్తోంది.

## మెట్రో స్టేషన్ల కుదింపు

హైదరాబాద్ : విమానాశ్రయ మెట్రో మార్గంలో ప్రాథమికంగా 24 స్టేషన్లను ప్రతిపాదించినా ఇందులో నాలుగు స్టేషన్ల వరకు తగ్గనున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సమీపంలోనే స్టేషన్లు ఉండటం, ప్రతిపాదించిన ప్రాంతంలో రైట్ ఆఫ్ వే సమస్యల వంటి కారణాలతో మార్పులు చేర్పులు చేయబోతున్నారు. మెట్రో సగటు వేగం పెంచేందుకు కూడా స్టేషన్ల తగ్గింపు పరిశీలిస్తున్నారు. మెట్రో రెండోదశలో 76.4 కి.మీ. మార్గంలో 54 స్టేషన్లను ప్రతిపాదిస్తే... నాగోల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36.8 కి.మీ మార్గంలోనే అత్యధికంగా 24 స్టేషన్లు ఉన్నాయి. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా కొన్నింటిని ప్రతిపాదించారు. దీంతో మెట్రో వేగం పెరిగి



విమానాశ్రయానికి త్వరగా చేరుకోవచ్చు.

**ప్రజాభిప్రాయాల ప్రకారమే స్టేషన్లకు పేర్లు :** విమానాశ్రయ మార్గంలో నాగోల్ టర్మినల్ స్టేషన్ పక్కనే ఎయిర్‌పోర్ట్ స్టేషన్ వస్తుంది. ప్రస్తుతం 24 స్టేషన్లు ప్రతిపాదించాం. వంకరలు లేకుండా నేరుగా ఈ మార్గం ఉండటం, 4 స్టేషన్ల తగ్గింపుతో వేగం ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఇదే తుది నిర్ణయం కాదు. ప్రజల అభిప్రాయం తీసుకున్న తర్వాతే స్టేషన్ల నిర్మాణం చేపట్టే ప్రదేశాలు, స్టేషన్ల పేర్లు ఖరారు చేయాలని నిర్ణయించాం. ప్రజలు తమ అభిప్రాయాలను చెప్పవచ్చు' అని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు(హెచ్‌ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి సూచనలు ఆహ్వానిస్తున్నారు.

## హుస్సేన్ సాగర్ చుట్టూ హరిత సొబగులు

హైదరాబాద్: చారిత్రాత్మక హుస్సేన్ సాగర్ చుట్టూ పచ్చదనం పెంపు దిశగా హెచ్‌ఎండీఏ చర్యలు తీసుకుంటోంది. ప్రజా పాలన.. విజయోత్సవ కార్యక్రమాల సందర్భంగా సాగర్ చుట్టూ 14 కిలోమీటర్ల మేర పూర్తి స్థాయిలో హరిత అందాలతో తీర్చిదిద్దుతోంది. పర్యాటకులకు కళ్లకు ఇంపుగా కనిపించేలా, ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా పరిసరాలు సుందరీకరణ చేస్తున్నారు. ముఖ్యంగా హుస్సేన్‌సాగర్‌లో 4 వైపులనుంచి నాలాలు కలుస్తున్నాయి. ఇందులో బంజారా, పికెట్, కూకట్‌పల్లి, బుల్కాపూర్ కీలకమైనవి. ఈ నాలాలు కలిసేచోట రోడ్డుకు రెండు వైపులా ఖానాల పక్కన ఉన్న గ్రిల్స్ వద్ద పచ్చదనం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఈ నాలాలు కలిసేచోట దుర్గంధం వెదజల్లుతోంది. సాగర్‌ను తిలకించడానికి వచ్చేవారు మురుగు వాసనతో అవస్థలు పడుతున్నారు. వర్టికల్ గార్డెన్‌లో పూల మొక్కల పెంపకంతో దుర్గంధానికి కొంతవరకు అడ్డుకట్ట వేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. కళ్లకు కనిపించే పచ్చదనంతో మనసుకు ఆహ్లాదకరంగా ఉండనుంది. సాగర్ చుట్టూ భారీ సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో వాయు కాలుష్యం పెరుగుతోంది. పర్యాటకులకు ఇది ఇబ్బందే. పచ్చదనంతో పర్యావరణ సమతుల్యతకు మేలు జరుగుతుందని అంటున్నారు. నిర్వహణే కీలకంవర్టికల్ గార్డెన్స్ నిర్వహణ సవాలుతో కూడుకున్నదే. గతంలో చాలా ప్రాంతాల్లో ఇవి ఏర్పాటు చేసినా తర్వాత నిర్వహణలేక ఎండిపోయాయి. ముఖ్యంగా పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వే కింద పిల్లర్లపై చాలా ప్రాంతాల్లో వాటిని ఏర్పాటుచేశారు. కొన్నిరోజులు నిర్వహణ చేపట్టి తర్వాత విస్మరించడంలో మొక్కలన్నీ ఎండిపోయాయి. అలా కాకుండా హుస్సేన్‌సాగర్ చుట్టూ ఏర్పాటు చేస్తున్న వర్టికల్ గార్డెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముంది.

## ఎల్లంపల్లి ఎడమ కాలువపై నిర్లక్ష్యం



మల్యాల : ఎల్లంపల్లి జలాలను గంగాధర మండలంలోని నారాయణపూర్ ప్రాజెక్టు ద్వారా మల్యాల మండలంలోని గ్రామాలకు తరలించేందుకు 10 ఏళ్ల కిందట చేపట్టిన ఎల్లంపల్లి ఎడమ కాలువ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నారాయణపూర్ ప్రాజెక్టు నీటిని మల్యాల మండలంలోని బల్వంతాపూర్, ముత్యంపేట, గుడిపేట, పోతారం, ఓబులాపూర్, అంతర్గాం గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూములకు అందించేందుకు దాదాపు 20 కి.మీ కాలువ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. రెవెన్యూ అధికారులు భూసేకరణ చేపట్టగా పలు గ్రామాల రైతులు వ్యతిరేకించి అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయి. గంగాధర మండలంలోని నారాయణపూర్ నుంచి మల్యాల మండలంలోని బల్వంతాపూర్ శివారు వరకు భూసేకరణ చేపట్టి నిర్వాసితులకు పరిహారం కూడా అందజేశారు. నీటిపారుదల శాఖ అధికారులు కాలువ నిర్మాణంతోపాటు కొంత దూరం లైనింగు పనులు కూడా పూర్తి చేశారు. దాదాపు 8 ఏళ్ల కిందట బల్వంతాపూర్ శివారు వరకు కాలువ నిర్మాణంతోపాటు లైనింగు పనులు కూడా పూర్తి చేసినప్పటికీ ముందుకు సాగలేదు. బల్వంతాపూర్ శివారులోని వైకుంఠధామం పక్కనుంచి వెళ్లే కాలువ నిర్మాణ పనులను నిలిపివేయడంతో దట్టంగా చెట్లు పెరిగాయి. ఈ విషయమై తహసీల్దారు మునిందర్‌ను సంప్రదించగా ఎల్లంపల్లి ఎడమ కాలువ నిర్మాణ పనుల వివరాల తెలియదని, నీటిపారుదల, రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు చూసుకుంటారని వివరించారు. ఇరిగేషన్‌శాఖ డీఈ తిరుపతిని వివరణ కోరగా ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎడమ కాలువ నిర్మాణ పనుల గురించి తనకు కూడా తెలియదని ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులే చూసుకుంటారని తెలిపారు.

## బిగుస్తున్న ఉచ్చు!



ఖమ్మం : నకిలీ బంగారంపై ఖమ్మంలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్(సీసీఎస్)లో బ్యాంకర్లు ఫిర్యాదుచేశారు. ఘటన జరిగిన 12 రోజుల తర్వాత ఓబ్యాంకుకు సంబంధించిన అధికారులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయటం విశేషం. ఖమ్మం నగరంలోని ఆరు బ్యాంకుల శాఖల్లో 26 ఖాతాల ద్వారా ఏడుగురు నకిలీ బంగారం ముంజేతి కంకణాలు (బ్రేస్‌లెట్లు) తాకట్టుపెట్టి రూ.35లక్షల రుణాలు తీసుకున్నారని ఫిర్యాదు చేశారు.

**సీసీఎస్‌లో ఫిర్యాదు..**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని వివిధ బ్యాంకుల్లో మోసం జరిగిన విషయాన్ని తీసుకొచ్చింది. అప్రమత్తమైన బ్యాంకర్లు తాకట్టు బంగారం రుణాలను పరిశీలించగా పెద్దఎత్తున మోసపోయినట్లు గుర్తించారు. నాలుగు శాఖల్లో రూ.28లక్షల వరకు మోసం జరిగినట్లు డీసీసీబీ ప్రకటించింది. ఈ విషయంపై ఇతర బ్యాంకులు మౌనం వహించాయి. మోసం జరిగినట్లు తెలిసినా పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. విషయాన్ని బయటకు పొక్కనీయకుండా జాగ్రత్తలు తీసుకున్నాయి. నవంబర్ 26న మూడు బ్యాంకుల ఉన్నతాధికారులు సీపీ సునీల్‌దత్‌ను కలిసి మోసపోయిన తీరును వివరించారు. వివిధ బ్యాంకుల్లో నకిలీ బంగారం తాకట్టురుణాలు వెలుగులోకి వస్తుండటంతో ఏ ఠాణా పరిధిలో కేసులు నమోదుచేయాలనే అంశంపై తర్జనభర్జనలు జరిగాయి. చివరకు సీసీఎస్‌లో కొన్ని బ్యాంకుల అధికారులు గురువారం ఫిర్యాదు చేశారు. ఇంకొన్ని బ్యాంకుల ఉన్నతాధికారులు ఫిర్యాదు చేయాలా, వద్దా అనే మీమాంసలో ఉన్నారు.

**కేసుల భయంతో రికవరీ..**

కేసులు నమోదైతే విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందని, ఉద్యోగాలు కోల్పోతామనే భయంతో కొన్ని బ్యాంకుల అధికారులు, సిబ్బంది, అప్రైజర్లే తాకట్టు రుణాలను చెల్లించినట్లు తెలిసింది. మరికొన్ని బ్యాంకుల్లో రుణగ్రహీతలను పిలిపించి ఒత్తిడి చేయటం ద్వారా కొంతవరకు రుణాలను స్వాధీనపరచుకున్నారు. ఇలా ఇప్పటివరకు సుమారు 30శాతం వరకు నకిలీ బంగారం తాకట్టు రుణాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

**ప్రధాన సూత్రధారిపై ఒత్తిడి..**

నకిలీ బంగారంతో బ్యాంకులను బురిడీ కొట్టించిన మోసగాడి మాటలు విని ఇబ్బందులు పడుతున్న అమాయకులు ఇప్పుడు అతడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివిధ బ్యాంకుల అధికారులు తమను పిలిపించి విచారిస్తున్నారని, తమపై మోసం కేసులు నమోదుచేస్తామని బెదిరిస్తున్నారని చెబుతున్నారు. రుణం డబ్బులు తమకు తిరిగిస్తే బ్యాంకులకు చెల్లిస్తామని ఒత్తిడి తెస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రధాన సూత్రధారి తన అనుచరుల ద్వారా కొంతమందికి డబ్బులు ఇచ్చి బ్యాంకుల్లో చెల్లిస్తున్నట్లు తెలిసింది. పెద్దమొత్తంలో మోసగించిన వ్యక్తిని పట్టుకుంటే కుంభకోణం మొత్తం వెలుగుచూసే అవకాశముంది. తాజాగా సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు అందిన నేపథ్యంలో ప్రధాన సూత్రధారి ఎవరో వెల్లడయ్యే ఆస్కారముందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.

## ఎక్కడైనా.. ఎప్పుడైనా అంతర్జాలం!

ఖమ్మం : భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ సంస్థ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. దేశంలో ఎక్కడైనా.. ఎప్పుడైనా తమ అంతర్జాల సేవలను వినియోగదారులకు అందించేందుకు సిద్ధమైంది. ఎఫ్‌టీటీహెచ్(ఫైబర్ టు ద హోమ్) ల్యాండ్‌లైన్ సర్వీస్‌తో 5జీ వైఫై రోమింగ్ సేవలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా ప్రక్రియ ప్రారంభమైంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు ఇళ్లలో వినియోగించే ల్యాండ్‌లైన్ చరవాణి(ఫోన్)లకు ఎఫ్‌టీటీహెచ్ వైఫై రోమింగ్ సేవలను ప్రారంభించే (ఇనేబుల్) పనులు చేపడుతోంది. ఒక్కసారి వినియోగదారులు చరవాణిలో తమ వివరాలతో వైఫై రోమింగ్‌లో లాగిన్ అయితే దేశవ్యాప్తంగా ఎక్కడ బీఎస్‌ఎన్‌ఎల్ ఎఫ్‌టీటీహెచ్ కనెక్షన్ సమీపంలో చూపించినా ఆటోమేటిక్‌గా వైఫై రోమింగ్ కనెక్ట్ అవుతుంది. అంతరాయం లేకుండా అంతర్జాల సేవలను వినియోగించుకోవచ్చు. వేరే చోటు నుంచి సేవలు పొందినా వినియోగదారునికి తాను ఎంచుకున్న బీఎస్‌ఎన్‌ఎల్ ప్లాన్‌లోనే డేటా ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఉభయ జిల్లాల్లో ఈ ప్రక్రియను నవంబర్ 1 నుంచి ప్రారంభించారు. నూతనంగా ల్యాండ్‌లైన్ తీసుకునేవారికి ఎనేబుల్ చేసి ఇస్తున్నారు.

**టీవీ సర్వీసులు సైతం..** బీఎస్‌ఎన్‌ఎల్ ఎఫ్‌టీటీహెచ్ ల్యాండ్‌లైన్ కనెక్షన్‌తో టెలివిజన్ (టీవీ) సర్వీసులను సైతం ప్రారంభించారు. నూతనంగా కనెక్షన్ తీసుకునే వినియోగదారులకు టీవీ కేబుల్, వైఫై రౌటర్లను ఉచితంగా అందిస్తున్నారు. ల్యాండ్‌లైన్ కనెక్షన్ ద్వారా బీఎస్‌ఎన్‌ఎల్ ఉల్కా(యుఎల్‌కేఏ) టీవీ పేరిట సర్వీసులను అందిస్తోంది. టీవీ సర్వీస్‌లను సెలెక్ట్ చేసుకొని హాట్‌స్పాట్ ఆన్‌లో ఉంచి నేరుగా టీవీలో 5జీ వైఫై సేవలను పొందే వీలుంటుంది. వినియోగదారులు టీవీ సర్వీసులను ఎప్పటికప్పుడూ రీఛార్జ్ చేసుకొని నేరుగా వైఫై రౌటర్ నుంచి అంతర్జాలం, టీవీ సేవలను అపరిమితంగా పొందవచ్చు.

## ఎదగని నారు.. రైతు బేజారు!

చేగుంట : జిల్లాలో వరి సాగే ప్రధానం కావడంతో, యాసంగి సీజన్ ప్రారంభంలోనే రైతులు నారుమళ్లు పోస్తున్నారు. అయితే వాతావరణంలో వస్తున్న మార్పులతో నారు ఎదగడంలేదు. కొన్నిచోట్ల చీడపీడలు వ్యాప్తిస్తున్నాయి. చలి తీవ్రతతో గింజ మొలకశాతం రావడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. యాసంగిలో జిల్లా వ్యాప్తంగా సుమారు 3 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. ప్రస్తుతం బోరు బావుల్లో సమృద్ధిగా నీరు ఉంది. వరి సాగు చేస్తే మేలని భావించిన వారు, చలితో ఇబ్బందులు పడుతున్నారు.

**సస్యరక్షణతో**

చలితో నారుమళ్లను కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ సూచించారు. మడికి ప్రతి రోజు సాయంత్రం నీటిని తొలగించి, పగటి పూట వెచ్చటి నీరు పెడుతుండాలి. రోజు సాయంత్రం వెదురు బద్దలు అమర్చి, దానిపై సన్నటి ప్లాస్టిక్ పేపర్ లేదా తాటి ఆకులను మడి మీద కప్పి మరుసటిరోజు ఉదయం తీసివేస్తే మంచు పడకుండా ఉంటుంది. నారు ఆరోగ్యంగా పెరిగేందుకు కిలో యూరియాకు రెండు గ్రాముల కార్బండీజమ్‌తో పాటు మాంకోజెబ్ మిశ్రమం కలిపి పిచికారీ చేయాలి. చలి తీవ్రంగా ఉండి, మంచుతో కూడిన వాతావరణం ఉంటే అగ్గితెగులు ఆశించే అవకాశం ఉంది. ఇది ఆశించకుండా ముందస్తుగా ట్రైసైక్లోజాల్ 0.6 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. జింకు లోపం వల్ల ఆకులపై మచ్చలు ఏర్పడతాయి. లోపాలు గమనిస్తే జింకు సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలుచు పురుగు నుంచి కాపాడుకునేందుకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు సరిపడే నారుమడికి కిలో చొప్పున పిచికారీ చేయాలి. నారు ఆరోగ్యంగా పెరిగేందుకు కిలో యూరియాకు 2 గ్రాముల కార్బండీజమ్‌ను మాంకోజెబ్ మిశ్రమ మందును కలిపి పిచికారీ చేయాలి.

## అంతస్తులు ఇంతింతై..!

హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) పరిధిలో అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. కొందరు అనుమతుల్లేకుండానే భారీ భవంతులు నిర్మిస్తుండగా.. కొందరు స్థానిక మున్సిపాలిటీల నుంచి అయిదు అంతస్తులకు అనుమతులు తీసుకొని 7-8 అంతస్తులపైనే నిర్మిస్తున్నారు. శంకర్‌పల్లి, శంషాబాద్ జోన్ల పరిధిలో ఎక్కువ శాతం ఇలాంటి అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. గతంలో వివిధ ప్రాంతాల్లో 600 వరకు అలాంటి హెచ్‌ఎండీఏ విజిలెన్సు విభాగం గుర్తించింది. అందులో 200 భవనాలను పాక్షికంగా కూల్చారు. తర్వాత అధికారులు శీతకన్ను వేయడంతో మళ్లీ అక్రమ నిర్మాణాలు జోరు సాగుతోంది. కూల్చిన భవనాలను కొందరు మరమ్మతులు చేసి మళ్లీ యధావిధిగా పూర్తి చేశారు.

**అయిదంతస్తులకు మించితే...**

హెచ్‌ఎండీఏ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, సిద్దిపేట పరిధిలో 1000 చదరపు మీటర్లలో 5 అంతస్తులకు మించి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించాలంటే బల్దియా లేదా హెచ్‌ఎండీఏ అనుమతులు తీసుకోవాలి. శివార్లలో ఐటీ ఇతర పరిశ్రమలు విస్తరిస్తుండటంతో అక్కడ అద్దె



ఇళ్లకు మంచి డిమాండ్ ఉంటోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని చాలామంది అక్రమంగా అంతస్తులు నిర్మిస్తున్నారు. నార్సింగి, కొత్వాల్‌గూడ, పుప్పాలగూడ, శంషాబాద్ ప్రాంతాల్లో అక్రమ భవంతులు పుట్టగొడుల్లా వెలస్తున్నాయి. అక్రమ భవనాలు గుర్తించడం తప్ప.. వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం హెచ్‌ఎండీఏకు లేదు. దీంతో స్థానిక మున్సిపాలిటీలకు ఆ పనులు అప్పగిస్తున్నా.. వారేమీ పట్టించుకోవడం లేదు.

**ఆదాయానికి భారీగా గండి**

అక్రమ భవనాలతో ప్రభుత్వానికి రావాల్సిన భారీ ఆదాయానికి గండిపడుతోంది. లేఅవుట్లు, భవనాల అనుమతుల ఫీజుల రూపంలో హెచ్‌ఎండీఏకు రూ.1000 కోట్లు నుంచి రూ.1200 కోట్లు వరకు ఆదాయం సమకూరుతోంది. అయితే పకడ్బందీ చర్యలు తీసుకుంటే ఈ ఆదాయం రూ.2 వేల కోట్లకు చేరనుందని అంచనా. గతంలో హెచ్‌ఎండీఏ గుర్తించిన 600 అక్రమ భవనాల ద్వారా దాదాపు రూ.100- రూ.150 కోట్లు ఫీజుల రూపంలో హెచ్‌ఎండీఏ ఆదాయం కోల్పోయింది. ఇది ఒక ప్రాంతంలో జరిగిన తనిఖీల్లో గుర్తించినవి మాత్రమే. గత కొన్నాళ్లు అక్రమ నిర్మాణాలపై హెచ్‌ఎండీఏ గప్‌చుప్‌గా ఉంటోంది. స్థానిక మున్సిపాలిటీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఫ్లోర్‌కు లక్ష వంతు వసూలు చేసి చూసీచూడనట్లు ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమ భవనాలకు నివాస యోగ్య పత్రం(ఆక్యుపెన్సీ సర్టిఫికేట్) నిలుపుదల చేసే అధికారం ఉన్నప్పటికీ ఇవేమీ పట్టించుకోవడం లేదు. ఓసీ లేకుండానే విక్రయించి చేతులు దులుపుకొంటున్నారు.

## ఎర్రమట్టి తవ్వకాలకు అడ్డేలేదు!

తాండూరు : జిల్లాలో ఎర్రమట్టి తవ్వకాలు ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండానే గుట్టుగా సాగుతున్నాయి. అంతేకాదు నిబంధనలకు విరుద్ధంగా తవ్వేస్తుండటంతో పరిసరాల్లోని ప్రజోపయోగ భవనాలకు ముప్పు వాటిల్లుతోంది. వృక్షాలను సైతం యథేచ్ఛగా నరికివేస్తున్నారు. దీంతో పర్యావరణానికి చేటు కలుగుతోంది. కళ్లముందు ఇంత జరుగుతున్నా అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరించడంపై తీవ్ర విమర్శలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో కథనం.

వేర్లతో సహా పెకిలించేశారు

తాండూరు మండలం అంతారం వద్ద రూ.2కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నారు. మరో రూ.2కోట్లతో ఆడిటోరియం నిర్మించారు. వీటి వెనుకే ప్రభుత్వ భూమిలోని గుట్టలను అమాంతం తవ్వేశారు. దీంతో పది అడుగుల గుంతలు ఏర్పడ్డాయి. ఇండోర్ స్టేడియం ఆనుకొని తవ్వకాలు చేపట్టడంతో భవిషత్తులో వర్షాలు కురిస్తే పునాదులు కూరుకుపోయి భవనం కుప్పకూలే ప్రమాదముంది. వీటి పక్కనే ఎకరాలో బంజారాభవన్ నిర్మిస్తున్నారు. గుంతలతో భవనం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. మట్టి తవ్వకాలతో గుట్టపైన పదులసంఖ్యలో పచ్చని చెట్లు దెబ్బతిన్నాయి. వేర్లతో సహా పెకిలించడంతో కొన్ని నేలకొరిగాయి. మరికొన్ని జాడలేకుండాపోయాయి. అక్రమ తవ్వకందారుల కార్యకలాపాలతో సహజ సంపదకు ఆపద



నెలకొంది. ఇదంతా సంగారెడ్డి, జహీరాబాద్ రహదారుల పక్కనే జరుగుతున్నా అధికారులు మిన్నకుండిపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**వారం క్రితం అడ్డగింత..**

వారం క్రితం అంతారం గ్రామస్థులు మట్టి తరలింపును అడ్డుకున్నారు. దీంతో నాలుగైదు రోజులు తవ్వకాలు ఆగిపోయాయి. ఇటీవల మళ్లీ కార్యకలాపాలు కొనసాగిస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణానికి చేటు తెచ్చేలా పనిచేస్తున్న వారిపై రెవెన్యూ, గనులు, అటవి శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ప్రభుత్వ పనుల పేరిట..**

రైల్వే, తారు రహదారుల పనుల పేరిట కొందరు ఎర్రమట్టి తవ్వకాలు చేపడుతున్నారు. అభివృద్ధి పనులకు మట్టి తరలించినప్పటికీ చెట్లు దెబ్బతినకుండా, స్థానికులు, పరిసరాల్లోని పంట పొలాల రైతులకు ఇబ్బంది కల్గకుండా తక్కువ లోతు వరకు తరలిస్తే సమస్య ఉండదు. కానీ అడుగుల లోతున ప్రజోపయోగ భవనాల పక్కనే తవ్వడంతో భవనాల పునాదులు కూలే ముప్పు తెచ్చిపెడుతున్నారు.

# పోతేపోనీ.. ప్రభుత్వ ఆస్తులేగా

హైదరాబాద్ : జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులను అక్రమ లీజుదారులు దర్జాగా అనుభవిస్తున్నారు. దశాబ్దం క్రితం లీజు పూర్తయినా వాటిని స్వాధీనం చేసుకోవట్లేదు. గజం స్థలానికి రూ.1 అద్దె చెల్లిస్తోన్న లీజు ఒప్పందాలు యథాతథంగా కొనసాగుతున్నాయి. దీంతో ప్రైవేటు వ్యక్తులు రూ.కోట్లు సంపాదిస్తుంటే..జీహెచ్ఎంసీ మాత్రం చిల్లరతో సరిపెట్టుకుంటోంది.



జీహెచ్ఎంసీ పరిధిలోని అనేక ప్రాంతాల్లో రూ.కోట్లు విలువ చేసే ఆస్తులున్నాయి. ప్రధాన రహదారుల పక్కన ఖాళీ స్థలాలు, రద్దీ ప్రదేశాల్లో మార్కెట్లు, మున్సిపల్ కాంప్లెక్సులు ఉన్నాయి. గతంలోని లెక్కల ప్రకారం 26 మార్కెట్లు, 19 కాంప్లెక్స్‌లు ఉన్నాయి. మార్కెట్లలో 2,330, కాంప్లెక్స్‌లలో 985 దుకాణాలు ఉన్నాయి. నాలుగు దశాబ్దాల క్రితం మెజార్టీ దుకాణాలను 25ఏళ్లకు బల్దియా లీజుకిచ్చింది. వీటిలో 90శాతం దుకాణాలను లీజుదారులు ఇతరులకు అద్దెకిచ్చారు. నిబంధనల ప్రకారం..లీజు పూర్తయ్యాక అధికారులు ఆయా దుకాణాలను ఖాళీ చేయించాలి. మళ్లీ వేలం వేసి ప్రక్రియను కొనసాగించాలి. ఏడాదికోసారి అద్దె విలువ 5శాతం మేర పెరగాల్సి ఉంటుంది. కొత్త నిబంధనల ప్రకారం..లీజు గడువు ఏడాది మాత్రమే. దాంతో ఏళ్లుగా దుకాణాలనువినియోగించుకుంటున్న వ్యక్తులు వేలానికి ఒప్పుకోవట్లేదు. దీనికి కేంద్ర కార్యాలయం పరోక్షంగా సహకరిస్తోందనే విమర్శలు ఉన్నాయి.

**అంచనాలు.. సవరణలతో సరి..** ఎకరాల కొద్దీ ఖాళీ స్థలాలు, వేలాది దుకాణాల నుంచి బల్దియాకు ఏటా వచ్చే ఆదాయం రూ.4.5కోట్లే. ప్రతిసారీ పద్దులో రూ.10కోట్లు, రూ.11కోట్ల అద్దెసొమ్ము వస్తుందని ఆర్థిక విభాగం అంచనాలు రూపొందించడం.. వచ్చిన అద్దెతో లెక్కలను సవరించుకోవడం ఆనవాయితీగా మారింది.

**నోటీసులతో సరి..**

మార్కెట్లలోని 1,500 దుకాణాలు, కాంప్లెక్సుల్లోని 600 యూనిట్లు, పలు స్థలాల లీజు గడువు పూర్తయింది. అధికారులు నోటీసులు ఇవ్వడం తప్ప స్వాధీనం చేసుకోవడం లేదు. అజాద్, మోజంజాహి మార్కెట్, తదితర ప్రాంతాల్లోని దుకాణాల నుంచి బల్దియాకు కొన్నేళ్లుగా అద్దె వసూలవ్వట్లేదు. సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లోని దుకాణాలకు నామమాత్రం అద్దె వసూలవుతోంది. రూ.వేలకోట్లు ఆస్తులు ఉన్న ఎస్టేట్స్ విభాగాన్ని కమిషనర్‌తోపాటు ఎస్టేట్స్ విభాగం అదనపు కమిషనర్ కార్యాలయమూ నిర్లక్ష్యం వహిస్తోంది.

# రూ.5,942 కోట్ల కొత్త ప్రాజెక్టులకు పచ్చజెండా

హైదరాబాద్: రాజధానిలో రహదారి కష్టాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. జీహెచ్ఎంసీ ప్రతిపాదించిన 23 రోడ్డు అభివృద్ధి పనులకు పచ్చజెండా ఊపింది. రూ.5,942 కోట్లను ఖర్చు చేసేందుకు పరిపాలన అనుమతి మంజూరు చేస్తూ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిశోర్ గురువారం ఉత్తర్వు జారీ చేశారు. జీహెచ్ఎంసీపై భారం పడకుండా ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చుతుందని, ఏటా రాష్ట్ర బడ్జెట్‌లో ఆమేరకు కేటాయింపులు చేస్తుందని పురపాలకశాఖ ఉత్తర్వులో స్పష్టం చేసింది. పైవంతెనలు, అండర్‌పాస్‌లు, ఆర్వోబీ, ఆర్‌యూబీల నిర్మాణానికేగాక, అవసరమైన భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్, నాణ్యత నియంత్రణ, ఇతరత్రా పనులకూ రాష్ట్ర పద్దు నుంచే నిధులను ఉపయోగించుకోవచ్చని స్పష్టం చేసింది. ఆ పనులకు ప్రజాపాలన విజయోత్సవాల్లో ఈనెల 3న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.

**గత ఉత్తర్వు స్థానంలో..**

వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్సార్డీపీ)లో భాగంగా 9 పనులకు అయ్యే రూ.4,305 కోట్లను ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) ద్వారా భరించాలని కోరుతూ జీహెచ్ఎంసీ గత భారాస సర్కారును అభ్యర్థించింది. 2023 సెప్టెంబరు 27న పరిపాలన అనుమతులు ఇస్తూ అప్పటి సర్కారు ఉత్తర్వు జారీ చేసింది. వాటితోపాటు మరో 14 పనులను కలిపి 23 పనులను హెచ్-సిటీలో చేపడుతోంది.

**పెరిగిన ట్రాఫిక్‌కు విరుగుడుగా..** హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇంపాక్ట్ స్టడీ జరిగింది. జీహెచ్ఎంసీ సైతం వాహన రద్దీపై కొత్త నిర్మాణాలు, ఆకాశహర్మ్యాల ప్రభావాన్ని తెలుసుకునేందుకు ఇటీవల అధ్యయనం చేపట్టింది. రహదారి అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరాన్ని ఆ రెండు అధ్యయనాలు స్పష్టం చేశాయనే విషయాన్ని బల్దియా కమిషనర్ సర్కారుకు తెలియజేశారు. రోడ్లతోపాటు కూడళ్ల అభివృద్ధి, పాదచారులకు సౌకర్యాలు, సొరంగమార్గాలు, వరదనీటి నియంత్రణ పనుల గురించి నివేదిక ఇచ్చారు.

# ధరల దడ

హైదరాబాద్ : ఒక్కసారిగా పెరిగిన నిత్యావసరాలు, కూరగాయల ధరలు సామాన్య, మధ్యతరగతి ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. వారంరోజులుగా కూరగాయలు, నిత్యావసరాల ధరలు 15-20 శాతం పెరిగి జేబులు గుల్ల చేస్తున్నాయి. కుటుంబ బడ్జెట్ ఒక్కసారిగా 25 నుంచి 30 శాతానికి చేరింది. బియ్యం ధరలు 10 రోజులుగా కిలోకు రూ.5-9 దాకా పెరిగాయి. ప్రస్తుతం బియ్యం ధరలు కనీసం కిలో రూ.50, పాతవి అయితే రూ.59-70 దాకా ఉంటున్నాయి. కందిపప్పు ధర ఇప్పటికే డబుల్ సెంచరీ కొట్టింది. కిలో రూ.200-230 దాకా ఉంది. మినపప్పు రూ.130-148 ఉండగా పెసరపప్పు రూ.160. శనగపప్పు మామూలు కన్నా రూ.30, రవ్వ, పల్లీల ధరలు రూ.10-20 దాకా పెరిగాయి. నెలరోజుల్లో వంట నూనెల ధరలు లీటరకు రూ.20 దాకా పెరిగాయి. 2 నెలల క్రితం రూ.115 ఉన్న సన్‌ఫ్లవర్ ఆయిల్ ఇప్పుడు రూ.154. సబ్బులు, టీ పొడి వంటివి కూడా 10-15 శాతం పెరిగాయి. నాలుగైదు రోజులుగా ఉల్లి, టమాట ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ఉల్లిగడ్డలు కిలో రూ.60గా ఉంది. కిలో టమాట ఇప్పుడు రూ.50-60 దాకా ఉంది. బీట్రూట్, క్యారెట్ ధర రూ.60 ఆలూ రూ.50, బెండ, దొండ, గోరు చిక్కుడు, వంకాయ రూ.40కి పైగా ఉన్నాయి.

# తాగునీటి కష్టాలు!




కరీంనగర్ : నగరంలో మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రంలో సాంకేతిక సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. 36 ఎంఎల్‌డీ ఫిల్టర్‌బెడ్ నుంచి హైలెవల్ జోన్‌కు తాగునీటిని పంపింగ్ చేస్తుండగా.. ఇక్కడ ఏమాత్రం ఆలస్యం జరిగినా దాని ప్రభావం సరఫరాపై పడుతోంది. ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయడం, నిరంతర పర్యవేక్షణ ఉంటే తప్ప అవస్థలు తీరేలా లేవు. గత నెల 23న ఈ నీటిశుద్ధి కేంద్రంలో నీరు బయటకు వచ్చి ప్యానల్ బోర్డు పూర్తిగా తడిసింది. ఒకరోజు పూర్తిగా పంపింగ్ నిలిపి వేయడంతో తాగునీటికి నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయినప్పటికీ సాంకేతిక సమస్యలు పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చొరవ చూపడంలేదు.

**పనిచేయని మోటార్లు**

రావాటర్‌ను ఫిల్టర్‌బెడ్‌లోకి తీసుకున్న తర్వాత పలుమార్లు శుద్ధి అవుతుంది. అక్కడి నుంచి క్లోరినేషన్, సంపులోకి పంపించాల్సి ఉంటుంది. పంపింగ్ చేసే సమయంలో పైపుల్లోని గాలిని బయటకు ముందుగా తీసేయాలి. దీనికోసం రెండు 5 హెచ్‌పీ సామర్థ్యం గల ఎయిర్ మోటార్లు నడిపించాల్సి ఉంటుంది. అందులో ఒక్కటే పని చేస్తుండగా ఆశించిన స్థాయిలో పైపుల నుంచి గాలి బయటకు రావడంలేదు. దీంతో నీరంతా బయటకు వస్తుంది. ఇలా పలుమార్లు జరగగా.. ఇటీవల నీరు ప్యానల్ బోర్డు వరకు చేరింది. పైగా పైపులకు లీకేజీలు ఉన్నాయి. మరో వైపు రెండు 370 హెచ్‌పీ మోటార్లు మూలనపడేశారు. నెల రోజుల్లో మరమ్మతులు చేస్తామని నాలుగు నెలల కిందట చెప్పిన అధికారులు.. ఆ విషయమే మర్చిపోయారు.

**కమిషనర్ ఆరా తీసినా..**

నీటి శుద్ధి కేంద్రాన్ని కొద్ది రోజుల కిందట నగరపాలక కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంలో ఒకే నంబర్ గల మోటారును విరామం లేకుండా నడిపించడాన్ని గుర్తించి ఆరా తీసినా.. అధికారులు దాటవేశారు. ఎలాంటి సమాధానం ఇవ్వకపోగా.. మరమ్మతులు చేయాలని ఆదేశించినప్పటికి అధికారుల్లో చలనం లేదు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు మిషన్ భగీరథ ఏజెన్సీ వారే అయిదేళ్లు నిర్వహణ చూడాలి. మోటార్లు, పంపులకు మరమ్మతులు చేయించాల్సి ఉంటుంది. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం.

– లచ్చిరెడ్డి, డీఈఈ, నగరపాలిక

# సంక్షేమ పథం!



కరీంనగర్ :'మార్పు కావాలంటే.. కాంగ్రెస్ రావాలంటూ'.. రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీల్లో కొన్ని నెరవేర్చడంతోపాటు ఉద్యోగాల కల్పన.. గ్యారంటీల అమలు ద్వారా వివిధ వర్గాలను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది.. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చి డిసెంబరు 7తో ఏడాది కావస్తున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లావాసులకు వివిధ పథకాల ద్వారా కలిగిన లబ్ధిపై కథనం.

**గ్యాస్ 'రాయితీ'తో మేలు..**

రూ.500కు గ్యాస్ సిలిండర్‌ను అందిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకుంది. ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకాన్ని అర్హులైన వారు వినియోగించుకుంటున్నారు. నాలుగు జిల్లాల పరిధిలో ప్రజాపాలనలో భాగంగా రేషన్‌కార్డు ఉన్న 8,13,880 మంది మహాలక్ష్మి పథకంలో భాగంగా రాయితీ సిలిండర్లు పొందాలని ఆశించారు. కానీ పౌరసరఫరాల శాఖ అధికారుల పరిశీలన తరువాత దాదాపుగా 6.12 లక్షల మంది అర్హులుగా గుర్తించారు. మొత్తంగా ప్రతినెల నగటున రూ.25కోట్ల రాయితీని జిల్లావాసులు అందుకుంటున్నారు. కొందరికి రెండు కనెక్షన్లు ఉండటం, ఇతర సాంకేతిక కారణాల వల్ల రాయితీ సాయం అందడం లేదు. వాటి విషయంలోనూ అధికారులు చొరవ చూపిస్తే బాగుంటుంది.

**'మాఫీ'తో రైతన్న ఖుషీ!**

రూ.2 లక్షల రైతు రుణ మాఫీని ఆరు గ్యారంటీల్లో ఒకటిగా ప్రకటించిన ప్రభుత్వం జులై 18న తొలి విడతలో రూ.లక్ష లోపు రుణం ఉన్న వారితో ఈ ప్రక్రియను ప్రారంభించింది. జులై 30న రెండో విడతలో రూ.లక్షన్నర లోపు ఉన్న వారికి పూర్తిచేసింది. ఆగస్టు మాసంలో రూ.2లక్షల్లోపు ఉన్నవారి ఖాతాల్లో ఈ నగదును జమచేసింది. సాంకేతిక సమస్యలతో మాఫీ కాని వారికి ఈ నెల 2వ తేదీన ప్రయోజనాన్ని అందించింది. 10 శాతం రైతులకు మాత్రం వివిధ కారణాలతో రుణమాఫీ వర్తించలేదు. ఈ విషయమై త్వరలో సర్కారు నిర్ణయం తీసుకుని అందరి రుణాల్ని తీర్చేస్తే అన్నదాతలంతా ఆనందపడుతారు.

**ఆరోగ్యానికి రక్ష!**

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఆరోగ్యశ్రీ అండగా నిలుస్తోంది. ఆపద వేళల్లో ఆరోగ్యానికి రక్షగా మారుతోంది. గతంలో రూ.5 లక్షల వరకే ఉన్న ఆస్పత్రి బిల్లుల చెల్లింపును రూ.10 లక్షలకు పెంచడంతో నాలుగు జిల్లాల పరిధిలో రేషన్‌కార్డు ఉన్న వారికి ఇది మేలు చేస్తోంది. ఆస్పత్రుల సంఖ్యతోపాటు చికిత్సనందించే వివిధ రుగ్మతల సంఖ్యను పెంచడంతో అదనంగా 15 శాతం మంది ఈ పథకం కింద లబ్ధిని అందుకుంటున్నారు. 2023 డిసెంబరు 9వ తేదీ నుంచి రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉమ్మడి జిల్లాలో 64,624 మందికి రూ.147.20 కోట్ల సాయం అందింది.

**గృహ జ్యోతి వెలుగులు**

తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుని గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ సంవత్సరం మార్చి నెలలో మొదలైన ఈ పథకం ద్వారా 200 యూనిట్లలోపు విద్యుత్తును వినియోగించుకున్నవారు బిల్లు కట్టనవసరం లేదు. ఈ పథకం పేద కుటుంబాలకు ఆర్థికంగా వెసులుబాటునిస్తోంది. ప్రజాపాలనలో వచ్చిన అర్జీల ఆధారంగా లబ్ధిదారులను గుర్తించారు. 200 యూనిట్లకన్నా తక్కువ వినియోగిస్తే మాత్రమే ఆ వ్యయాన్ని సర్కారు భరిస్తుంది. ఇలా ఈ ఏడాది మార్చి నుంచి నవంబరు వరకు తొమ్మిది నెలల వ్యవధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50.75 లక్షలకుపైగా జీరో బిల్లులను వినియోగదారులు అందుకున్నారు. ఇందుకు సంబంధించి దాదాపుగా రూ.198.03 కోట్లను ప్రభుత్వమే విద్యుత్తు సంస్థకు చెల్లించింది.

# యాసంగి సాగుకు ప్రణాళిక


కరీంనగర్ : జిల్లాలో యాసంగి సాగు ప్రణాళికను వ్యవసాయశాఖ ఖరారు చేసింది. జిల్లా వ్యాప్తంగా 3,04,655 ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు కానున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇందులో వరి 2.65 లక్షల ఎకరాలు కాగా మొక్కజొన్న 26 వేల ఎకరాల్లో సాగు చేయనున్నారు. యూరియా 42,416 మెట్రిక్ టన్నులు, డీఏపీ 7,796 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 22,339 మెట్రిక్ టన్నులు ప్రైవేట్‌లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

**బోర్లు, బావులే ఆధారం**

జిల్లాలో ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు కురిశాయి. బోర్లు, బావులు, ఎస్సారెస్పీ కాలువపై ఆధారపడి సేద్యం చేస్తున్నారు. గతేడాది 3,04,742 ఎకరాలు సాగుచేయగా.. ఈసారి 3,04,655 ఎకరాల సాగుకు ప్రణాళిక ఖరారు చేశారు. అంటే ఇంచుమించు గతేడాది మాదిరిగానే సాగు చేస్తున్నారు. ఇప్పటికే వానకాలం వరి పొలాలు కోసి, యాసంగికి నార్లు పోశారు. మొక్కజొన్న సాగు రైతులు సైతం రైతులు సిద్ధమయ్యారు. కొన్ని మండలాల్లో ఎస్సారెస్పీ కాలువపై ఆధారపడి సాగు చేస్తున్నారు.

**ఆరుతడి పంటలపై అనాసక్తి**

అన్నదాతలు ఆరుతడి పంటలైన పొద్దు తిరుగుడు, మినుములు వంటి పంటల సాగుకు ఆసక్తి చూపడంలేదు. ఈ పంటలకు నీరు తక్కువ మోతాదులో అవసరమైనప్పటికీ సాగుకు దూరంగా ఉంటున్నారు.




**అందుబాటులో విత్తనాలు, ఎరువులు**

జిల్లాలో యాసంగి సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొరత లేకుండా చూస్తున్నాం. ఎక్కడైనా రైతులకు అధిక ధరలకు అమ్మినట్లు ఫిర్యాదులు అందితే డీలర్లపై చర్యలు తీసుకుంటాం.

– భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి, కరీంనగర్

# ప్రభావం తక్కువైనా అప్రమత్తత తప్పనిసరి

హైదరాబాద్ : దక్కన్ పీఠభూమి స్థిరమైన కఠిన శిలతో కూడిన ఎత్తైన భూమి కావడంతో ఈ ప్రాంతంలో భూకంపాల ప్రభావం చాలా తక్కువగా ఉంటుందని, అయితే వాటి ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగాల్సి ఉందని సెంట్రల్ గ్రౌండ్ వాటర్‌బోర్డు (సీజీడబ్ల్యూబీ) సదరన్ రీజినల్ రిటైర్డ్ డైరెక్టర్, శాస్త్రవేత్త ఎం.వీరన్న అభిప్రాయపడ్డారు. సుమారు ఐదు దశాబ్దాల క్రితమే గోదావరి వ్యాలీలోని ములుగు ప్రాంతంలో భూగర్భజలాలు, ఇతర వనరుల అన్వేషణ కోసం వివిధ జాతీయ సంస్థలు అధ్యయనం చేశాయన్నారు. అక్కడ భూమిలోని విభిన్న పరిస్థితుల నేపథ్యంలో భూ పొరల్లో సర్దుబాట్ల వల్ల తాజా ప్రకంపనలు వచ్చాయని.. గోదావరి లోయతో అనుసంధానమైన ప్రాంతాల్లో ఆ ప్రభావం ఉందని తెలిపారు. తెలంగాణలో 1843లో ఆదిలాబాద్ ప్రాంతంలో వచ్చిన భూకంపం తీవ్రత 3.7 కాగా, అప్పటి నుంచి వచ్చిన వాటి వివరాలు అందుబాటులో ఉ



న్నాయన్నారు. తీవ్రత ఐదు అంతకంటే ఎక్కువ నమోదైన ఘటనలు మూడుసార్లే ఉన్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నమోదవుతున్న ప్రకంపనలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేకున్నా భారీగా కట్టడాల నేపథ్యంలో.. జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి అని తెలిపారు. **హైదరాబాద్‌లో ఎలాంటి అప్రమత్తత అవసరం?:** హైదరాబాద్ భూకంపాల కేటగిరి రెండులో ఉంది. ఈ ప్రాంతం ప్రాచీనమైన దక్కన్ పీఠభూమిలో భాగం. భూకంపాల ప్రభావం చాలా తక్కువ. సాధారణంగా ఇక్కడ నమోదయ్యే వాటి తీవ్రత రెండు లేదా మూడు వరకు ఉండొచ్చు. ఎత్తైన, భారీ అంతస్తుల నిర్మాణం విషయంలో భూమి స్వభావంపై అధ్యయనం చేపట్టాలి.

**గోదావరి లోయ ప్రత్యేకతలు** గోదావరి లోయ భిన్నమైంది...ప్రాచీనమైంది. ఈ లోయ ప్రాణహిత నుంచి సముద్రం వరకు విస్తరించింది. గతంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు 1976-77లో ములుగు ప్రాంతంలో కీలక అధ్యయనాలు చేశాయి. సెంట్రల్‌గ్రౌండ్ వాటర్‌బోర్డు, ఓఎన్‌జీసీ, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్‌లో జియోలాజికల్ స్టడీ విభాగం పలు అధ్యయనాలు చేపట్టాయి. భూగర్భజలాల మ్యాపింగ్‌తో పాటు వివిధ రకాల భూగర్భ నిక్షేపాలపై ఇవి కొనసాగాయి.

# చొరవ లేక.. పనులు సాగక

హైదరాబాద్ : వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్సార్డీపీ) నత్తనడకన సాగుతోంది. సకాలంలో నిధులు విడుదల చేయలేకపోవడంతో పనుల పురోగతి గాడి తప్పుతోంది. పైవంతెనలు, ఆర్వోబీల నిర్మాణ వేగం తగ్గిపోయింది. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కావడం లేదు. గత సర్కారు చేపట్టిన పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో ఏడాది గడిచినా పెద్దగా మార్పు కనిపించడం లేదు. స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులు ఎవరూ పెద్దగా దృష్టి



సారించకపోవడంతో ప్రజలకు శాపంగా మారింది.

**ఇదొక్కటే బాగు..** జూపార్కు, ఆరాంఘర్ చౌరస్తాల మధ్య నిర్మించిన పైవంతెన ఒక్కటే చకచకా సాగింది. ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. మిగిలిన పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. ఒవైసీ ఆస్పత్రి నుంచి నల్గొండ ఎక్స్ రోడ్డు వరకు రోడ్డు నరకానికి చిరునామాగా మారింది.

**భూసేకరణ కష్టాలు..**

గత ప్రభుత్వం ఎస్సార్డీపీ పేరుతో నగరవ్యాప్తంగా అండర్‌పాస్‌లు, ఆర్వోబీ, ఆర్‌యూబీ, పైవంతెనలు కలిపి 35 పనులను చేపట్టింది. వాటిల్లో ఆరు పనులు పురోగతిలో ఉన్నాయి.

జూ పార్కు- ఆరాంఘర్ పైవంతెన ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. నాలుగు కి.మీ పొడవున ఉన్న పైవంతెనకు రెండు చోట్ల ఇరువైపులా కలిపి నాలుగు ర్యాంపులు నిర్మించాల్సి ఉంది. నిధుల సమస్యతో వీటిని తర్వాత నిర్మిద్దామనుకున్నారు. ముందుగా పైవంతెనను అందుబాటులోకి తీసుకొద్దామని నిర్ణయించారు. జూపార్కు ఎదురుగా ఉన్న ఐదు నిర్మాణాలను తొలగిస్తే తప్ప ప్రారంభోత్సవం జరపలేని పరిస్థితి ఉంది. అందుకే కమిషనర్ నిధులు అందజేశారు. ప్రస్తుతం నిర్మాణాల కూల్చివేత జరుగుతోంది. మరో రెండు, మూడు రోజుల్లో సర్వీసు రోడ్డును బాగు చేసి పైవంతెనను ప్రారంభిస్తామని ఇంజినీర్లు చెబుతున్నారు.

ఫలక్‌నుమా ఆర్వోబీ నిర్మాణం నత్తకు నడక నేర్పుతోంది. నాలుగేళ్ల క్రితం పనులు మొదలయినా.. సగం పనులే పూర్తయ్యాయి. ఇరుకు రోడ్డుపై రాకపోకలు సాగించలేక వాహనదారులు అవస్థ పడుతున్నారు. గడిచిన ఏడాదిలో కేవలం 11శాతం పనులే జరిగాయి.

భూసేకరణ, రైల్వే శాఖ చేపట్టాల్సిన నిర్మాణ పనులతో శాస్త్రిపురం ఆర్వోబీ నిర్మాణంలో జాప్యం జరుగుతోంది.

ఉప్పల్ నుంచి నారపల్లి వరకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం జరుగుతోంది. దాన్ని కూడలిలోని మెట్రో మార్గం పైనుంచి ఉప్పల్ క్రికెట్ స్టేడియం వైపునకు మళ్లిస్తూ చేపట్టిన పనులు పిల్లర్ల నిర్మాణం దశలోనే ఉన్నాయి. ఇప్పటి వరకు 8శాతం పనులే జరిగాయి.



## ఆర్‌బీఐ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా

దిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన గవర్నర్‌గా రెవెన్యూ శాఖ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా నియమితులయ్యారు. ప్రస్తుత గవర్నర్ శక్తికాంత దాస్ పదవీ కాలం రేపటితో (డిసెంబర్ 10) ముగియడంతో తదుపరి గవర్నర్‌ను కేంద్రం నియమిచింది. 2018లో ఆర్‌బీఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన శక్తికాంత దాస్.. పదవీ కాలం 2021లోనే ముగియగా కేంద్రం మరో మూడేళ్లు పొడిగించింది. ఈ గడువు కూడా డిసెంబర్ 10తో ముగియనుండడంతో కొత్త గవర్నర్‌ను నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. మల్హోత్రా ఆర్‌బీఐకి 26వ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. డిసెంబర్ 11 నుంచి మూడేళ్ల కాలం పాటు ఆయన ఈ పదవీలో కొనసాగుతారు. సంజయ్ మల్హోత్రా 1990 బ్యాచ్ రాజస్థాన్ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఐఐటీ కాన్పూర్‌లో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆయన అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ అభ్యసించారు. విద్యుత్, ఆర్థిక, పన్నులు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మైన్స్ తదితర రంగాల్లో మూడు దశాబ్దాలకు పైగా సర్వీసులందించారు. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖలోని రెవెన్యూ విభాగం కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వంలో ఆర్థిక, పన్నుల విషయంలో అపారమైన అనుభవం కలిగిన ఆర్థిక, ట్యాక్సేషన్‌లో అపారమైన అనుభం కలిగిన సంజయ్ మల్హోత్రా.. ప్రత్యక్ష, పరోక్ష పన్నులకు సంబంధించిన విధాన రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారు.

## ది టెక్, డేటా నడిపించే శతాబ్దం : ప్రధాని మోదీ



ప్రపంచవ్యాప్తంగా ప్రతి పెట్టుబడిదారుడు భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహంగా ఉన్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన 'ది రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ 2024'లో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమం ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరగనుంది. "రిఫార్మ్, పెర్ఫార్మ్, ట్రాన్సఫార్మ్ మంత్రంగా భారత్ చేసిన అభివృద్ధి ప్రతి రంగంలోను కనిపిస్తోంది. గత పదేళ్లలో భారత్ 10 అతిపెద్ద ఆర్థికవ్యవస్థల నుంచి 5వ స్థానానికి చేరింది. గత పదేళ్లలో ఆర్థికవ్యవస్థ మారడంతో ఎగుమతులు రెట్టింపు అయ్యాయి. ఇక ఎఫ్‌డీఐలు కూడా రెండింతలు పెరిగాయి. ఈ సమయంలో దేశంలో ఇన్ఫ్రాపై వ్యయాలు రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.12 లక్షల కోట్లకు చేర్చాము. భారత్ వంటి వైవిధ్యభరితమైన దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లడం మనకు పెద్ద ఉపయోగం. మరికొన్నేళ్లపాటు మనం అత్యంత యువ దేశంగా ఉండనున్నాం. ఇక్కడే అత్యధికమంది నైపుణ్యవంతులైన యువకులు ఉంటారు. ఇది టెక్, డేటా నడిపించే శతాబ్దం. గత పదేళ్లలో ఇంటర్నెట్ వినియోగం నాలుగు రెట్లు పెరిగింది. ఇక డిజిటల్ చెల్లింపుల్లో భారీగా పుంజుకొంది. స్వాతంత్ర్యం తర్వాత ప్రభుత్వాలు రాజస్థాన్ అభివృద్ధి, సంస్కృతిని నిర్లక్ష్యం చేశాయి. అందుకే ఈ రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. 'వికాస్ భీ- విరాసత్ భీ' మంత్రంగా మా ప్రభుత్వం పనిచేస్తోంది. రాజస్థాన్‌లోని పరిస్థితులు పెట్టుబడులకు అనుకూలంగా ఉన్నాయి. ఇక్కడి ప్రజలు బాగా నేర్చుకొంటారు. భారత్‌లో అతిపెద్ద సోలార్ పార్కుల్లో చాలావరకు ఇక్కడే ఏర్పాటవుతున్నాయి. డ్రైపోర్టులకు ఇది అత్యంత అనుకూలమైన ప్రదేశం. రెండు ఎయిర్ కార్గో కాంప్లెక్సులు కూడా ఏర్పాటుచేశాం" అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ తొలుత మాట్లాడుతూ ఇప్పటికే రూ.30 లక్షల కోట్ల విలువైన ఎంవోయూలు జరిగినట్లు తెలిపారు. అనంతరం వ్యాపారవేత్తలు బిర్లా గ్రూప్‌నకు చెందిన కుమార మంగళం బిర్లా, మహీంద్రా అధినేత ఆనంద్ మహీంద్రా, వేదాంత రిసోర్స్ వ్యవస్థాపకులు అనిల్ అగర్వాల్ ప్రసంగించారు.

## కడప పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరైన అవినాష్‌రెడ్డి పీఏ



కడప: వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి కడపలో పోలీసు విచారణకు హాజరయ్యారు. ఆయనకు ఇటీవల పోలీసులు 41ఏ నోటీసులు ఇచ్చారు. దీంతో కడప సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌కు విచారణకు వచ్చారు. వర్రా రవీందర్‌రెడ్డి కేసులో రాఘవరెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. నెల రోజుల తర్వాత ఆయన పులివెందుల రావడంతో పోలీసులు నోటీసులిచ్చారు.

ప్రస్తుతం పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ మురళీ నాయక్ ఆయన్ను విచారిస్తున్నారు. సునీత, షర్మిల, విజయమ్మపై వర్రా రవీందర్‌రెడ్డితో అసభ్యకర పోస్టులు పెట్టించారని రాఘవరెడ్డిపై ఆరోపణలున్నాయి.

## నంద్యాల జిల్లాలో దారుణం: పెట్రోల్ పోసి నిప్పంటించిన యువకుడు.. బాలిక మృతి



నందికొట్కూరు: నంద్యాల జిల్లా నందికొట్కూరులో దారుణం చోటుచేసుకుంది. ప్రేమించలేదనే కారణంతో బాలికపై యువకుడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో బాలిక మృతిచెందింది. యువకుడికి మంటలు అంటుకోవడంతో గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి మండలం సామర్లకోటకు చెందిన బాలికను కలుగొట్లకు చెందిన యువకుడు రాఘవేంద్ర (21) కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు ఆమెను నందికొట్కూరులోని అమ్మమ్మ ఇంటికి పంపారు. ఆరు నెలల క్రితం యువకుడు అక్కడికి వచ్చాడు. దీంతో ఈ విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు చేరవేశారు. బాలిక స్నేహితులు ఎవరు వచ్చినా ఇంటికి రానివ్వొద్దని వారు సూచించారు. అయితే ఆదివారం అర్ధరాత్రి దాటాక ఆ రాఘవేంద్ర మళ్లీ వచ్చాడు. చదువుకునే గదిలో బాలిక నిద్రిస్తుండగా డోర్ కొట్టాడు. డోర్ తెరవడంతో లోపలికి వెళ్లి గడియపెట్టాడు. ఆ తర్వాత కాసేపటికి బాలికపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు పెడుతూ అక్కడికక్కడే మృతిచెందింది. యువకుడికీ మంటలు అంటుకోవడంతో గాయాలయ్యాయి. అతడు గడియ తీసి పారిపోతుండగా కుటుంబ సభ్యులు, స్థానికులు పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనాస్థలికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గాయాలతో ఉండటంతో రాఘవేంద్రను 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన బొత్స




విశాఖపట్నం, డిసెంబర్ 9: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ నేతలు ఎన్నో మాటల తూటాలు పేలారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను కూడా ఎన్నో సార్లు తప్పుబట్టారు. వైసీపీ పాలనే బెటర్ అంటూ పోకడలకు పోయారు కూడా. ఇప్పుడు తాజాగా ప్రభుత్వం నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌ను ఉద్దేశిస్తూ ఎమ్మెల్సీ బొత్స సత్యానారాయణ పలు వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్సీ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. వైసీపీ హయాంలో నాడు- నేడు కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులు పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో కనిపించాయంటూ కామెంట్స్ చేశారు. బొత్స ఇంకా మాట్లాడుతూ.. విశాఖలో డ్రగ్స్ వ్యవహారంపై తాను మళ్ళీ కేంద్రానికి లేఖ రాస్తున్నట్లు తెలిపారు. "డ్రగ్స్‌కు సంబంధించి మాపై విష ప్రచారం చేశారు.. ఎన్నికల్లో లబ్ధి పొందారు" అంటూ విరుచుకుపడ్డారు. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా ప్రతినిధులు పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించామని తెలిపారు. ప్రజల సమస్యలపై పోరాటం చేయాలని పార్టీ నిర్ణయించిందన్నారు. వర్షాల నేపథ్యంలో రైతాంగం ఇబ్బందులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల13 వ తేదీన అన్ని కలక్టరేట్‌లో వినతిపత్రలు అందజేస్తామన్నారు. ఈనెల 27వ తేదీన విద్యత్ చార్జీలు పెంపుపై విద్యుత్ కార్యాలయాలలో వినతిపత్రలు అందజేయనున్నట్లు వెల్లడించారు. విద్యుత్ భారాలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఫీజ్ రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని జనవరి 3న కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలన్నారు. సీబీఐ కంటైనర్‌లో డ్రగ్స్ లేదని సీబీఐ చెప్పడంతో.. విశాఖపై ఉన్న డ్రగ్స్ మచ్చ పోయిందన్నారు. అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోవాలనే దానిపై కేంద్ర హెూంమంత్రికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు మేనేజ్‌కు గురైతే ఏపీ పరువు పోతుందన్నారు. సిట్ రిపోర్ట్‌ను బహిర్గతం చేయాలని లేఖ రాస్తానన్నారు. విశాఖ డైరీపై వేసిన సభా సంఘంపై ఎమ్మెల్సీలను భాగస్వామ్యం చేయాలని లేఖ రాసినట్లు తెలిపారు. సభా సంఘంలో శాసనమండలిలోని సభ్యులను భాగస్వామ్యం చేయాలన్నారు. ధాన్యం కొనుగోలుపై మంత్రి నాదెండ్ల మాటలు.. పరుచూరి బ్రదర్స్ డైలాగ్స్‌లా ఉన్నాయని ఎద్దేవా చేశారు. "గతంలో వేసిన సిట్ నివేదికలను మేము పెట్టలేకపోయాం... ఇప్పుడు కూటమి ప్రభుత్వమే ఉంది కదా.. ఎవరిది తప్పు ఉంటే వారిపై చర్యలు తీసుకోండి" అంటూ ఎమ్మెల్సీ బొత్స సత్యానారాయణ వ్యాఖ్యలు చేశారు.



## భాజపా రాజ్యసభ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్య

దిల్లీ: మూడు రాష్ట్రాల్లో ఖాళీ అయిన రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను భాజపా ప్రకటించింది. ఏపీ నుంచి బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కు అవకాశం కల్పించింది. గతంలో ఆయన వైకాపా నుంచి రాజ్యసభకు ఎన్నికై ఇటీవల రాజీనామా చేశారు. ఆర్.కృష్ణయ్యతో పాటు హరియాణా నుంచి రేఖాశర్మ, ఒడిశా నుంచి సుజిత్‌కుమార్‌ను అభ్యర్థులుగా భాజపా ఎంపిక చేసింది.



## జగన్ కు 3100 కోట్ల ముడుపులు.. అధికారం తో అరాచకాలు

అమరావతి: రాయదుర్గం నియోజకవర్గంలోని డి.హీరేహల్ మండలం, కులకర్తికి చెందిన రైతు రామాంజనేయులు రెడ్డికి చెందిన రూ. కోటి విలువైన 11 ఎకరాల భూమిని అప్పటి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి తన బినామీల పేరుతో సొంతం చేసుకున్నారు. ఆ రైతు ఆయన కుమారుడిని ఎస్సీ, ఎస్టీ కేసులో పేరుతో బెదిరించారు. రౌడీ షీటు ఓపెన్ చేయించి నానా ఇబ్బందులకు గురి చేశారు. అప్పటి ఎమ్మెల్యే కిలారీ వెంకట రోశయ్య అండదండలతో మట్టి మాఫియా చెలరేగిపోయింది. చేబ్రోలు మండలంలో నాణ్యమైన ఎర్ర గ్రావెల్ భూములను అడ్డగోలుగా చేజిక్కించుకుని అక్రమార్జనకు తెరతీశారు. 2 వందల ఎకరాల్లో పండ్ల తోటలను కనుమరుగు చేశారు. వీరనాయకుని పాలెం గ్రామంలో దశాబ్దాల క్రితం ప్రభుత్వం దళితులకు ఇచ్చిన అసైన్డ్ పంట భూముల్లో పాగా వేసి దళితులను తరిమేసి.. ఎదురుకేసిపెట్టి మట్టి తవ్వకాలు సాగించారు. రాష్ట్ర స్థాయిలో వైసీపీ పెద్దలు దున్నేయగా... జిల్లాల స్థాయిలో అప్పటి ఎమ్మెల్యేలు, మంత్రులు కుమ్మేశారు. జగన్ 'ఘనత' రాష్ట్రం, దేశ సరిహద్దులు దాటి ఖండాంతరాలకు చేరగా... ఆయన పార్టీ నేతలు తమకు చేతనైనంతగా చెలరేగిపోయారు. గత ఐదేళ్లలో ఒక్క మద్యంలోనే తాడేపల్లికి రూ. 3,100 కోట్ల ముడుపులు అందగా... కింది స్థాయి నేతలూ అధికారం అండతో కోట్లకు పడగలెత్తారు. అడ్డగోలుగా జనమ్మీద పడి దోచుకున్నారు. ప్రకృతి వనరులను చెరబట్టారు. ప్రతి పనిలోనూ వాటాలు, ముడుపులు పిండుకున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ భూములు అన్నతేడా లేకుండా బెదిరించి మరీ వేలాది ఎకరాలు సొంతం చేసుకున్నారు.



## సిరియా సంక్షోభం భారత్ ఏమన్నదంటే!

దిల్లీ: దశాబ్దానికి పైగా అంతర్యుద్ధంలో కొట్టుమిట్టాడుతున్న సిరియాలో ప్రస్తుతం రాజకీయ అనిశ్చితి నెలకొంది. తిరుగుబాటుదారుల విజృంభనతో అధ్యక్షుడు బషర్ అల్-అసద్ దేశాన్ని వీడాల్సి వచ్చింది. దీంతో ఆయన ప్రభుత్వం కూలిపోయి.. సిరియా పూర్తిగా తిరుగుబాటుదారుల నియంత్రణలోకి వెళ్లినట్లయింది. ఈ పరిణామాలపై తాజాగా భారత విదేశాంగశాఖ స్పందించింది. ఆ దేశంలో మళ్లీ స్థిరత్వం రావాలని ఆకాంక్షించింది. "సిరియాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను సునిశితంగా గమనిస్తున్నాం. దేశ ఐక్యత, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకునేందుకు అక్కడి అన్ని పార్టీలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. సిరియా ప్రజల అభీష్టానికి అనుగుణంగా శాంతిస్థాపన జరిగేలా సమ్మిళిత రాజకీయ ప్రక్రియ ఉండాలని సూచిస్తున్నాం" అని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఆ దేశంలో ఉన్న భారతీయుల భద్రత కోసం డమాస్కస్‌లోని ఇండియన్ ఎంబసీ నిరంతరం పనిచేస్తోందని పేర్కొంది. సిరియాలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్న వేళ.. అక్కడి భారతీయుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అయితే వారంతా సురక్షితంగా ఉన్నట్లు విదేశాంగశాఖ వర్గాలు ఆదివారం వెల్లడించాయి. డమాస్కస్‌లోని మన రాయబార కార్యాలయాన్ని అన్నివేళలా తెరిచే ఉంచినట్లు పేర్కొన్నాయి. తిరుగుబాటుదారుల ఆక్రమణతో అధ్యక్షుడు అసద్ తన కుటుంబంతో సహా రష్యాకు శరణార్థిగా చేరుకున్నారు. ప్రస్తుతం ఆయన మాస్కోలో ఉన్నారు. అధికార బదిలీపై తిరుగుబాటుదారులతో చర్చలు జరిపాకే అసద్ సిరియా వీడారని రష్యా ప్రభుత్వం తెలిపింది.

ఇక, అసద్ వెళ్లిపోయిన తర్వాత అధ్యక్ష భవనంలోకి ప్రజలు దూసుకెళ్లారు. అక్కడి ఫర్నిచర్, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లిన దృశ్యాలు బయటికి వచ్చాయి. అధ్యక్షుడికి సంబంధించిన ప్రైవేటు గ్యారేజీలో కోట్ల రూపాయల విలువైన పోర్ష్, లంబోర్గిని, ఫెరారీ వంటి కార్లు ఉన్న వీడియోలు వైరల్ అయ్యాయి.



## భారత్-బంగ్లాదేశ్ మధ్య కీలక చర్చలు

ద్వైపాక్షిక సంబంధాల్లో ఉద్రిక్తతలు తలెత్తడంతో చర్చలు జరిపేందుకు భారత కార్యదర్శి విక్రమ్ మిశ్రి బంగ్లాదేశ్‌కు వెళ్లారు. ఆ దేశ విదేశాంగశాఖ కార్యదర్శి మహమ్మద్ జషీముద్దీన్‌తో ఆయన కీలక అంశాలను చర్చించే అవకాశం ఉంది.

సోమవారం ఉదయం భారత వాయుసేన విమానంలో విక్రమ్ ఢాకా చేరుకొన్నారు. బంగ్లాదేశ్‌లో ఆయనకు విదేశాంగ మంత్రిత్వశాఖ సీనియర్ అధికారి స్వాగతం పలికారు. ఆ తర్వాత మిశ్రి-మహమ్మద్ జషీముద్దీన్‌లు చర్చలు జరిపారు. ఇక ఈ పర్యటనలో భాగంగానే మిశ్రి బంగ్లాదేశ్ తాత్కాలిక విదేశాంగ మంత్రి మహమ్మద్ తౌహిద్ హెూస్సానితో చర్చలు జరపనున్నారు. అదే సమయంలో ఆ దేశ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనుస్‌తో కూడా ఫోన్ కాల్‌లో మర్యాదపూర్వకంగా మాట్లాడనున్నారు.

**ఇక సిరియా దారెటు?...**బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిన తర్వాత బంగ్లాలో హిందూ మైనార్టీలపై దాడులు తీవ్రమైన వేళ మిశ్రి పర్యటన చోటు చేసుకోవడం గమనార్హం. ముఖ్యంగా ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టుతో పరిస్థితి మరింత దిగజారింది. ఆయనకు న్యాయసాయం అందించడంపై కూడా ఆందోళనలు నెలకొన్నాయి. దీనికి నిరసనగా పశ్చిమబెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాల వద్ద ఆందోళనలు జరిగాయి. ఇటీవల త్రిపురలోని అగర్తలాలో ఉన్న బంగ్లాదేశ్ అసిస్టెంట్ హైకమిషనర్ కార్యాలయం ముందు వందల మంది ప్రజలు ఆందోళనకు దిగారు. ఆ ఆఫీస్‌ను బంద్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ ఇద్దరు దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించింది. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వీరిద్దరూ ఢాకా నుంచి పనిచేయాలని సూచించినట్లు సమాచారం. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగినట్లైంది.

కోల్‌కతాలోని డిప్యూటీ హైకమిషనర్ షిక్దార్ మహమ్మద్ అష్రఫుల్ రహ్మాన్, అగర్తలలోని అసిస్టెంట్ హైకమిషనర్ ఆరిఫ్ మహమ్మద్‌ను రీకాల్ చేసిన విషయం తెలిసిందే. ఈ అంశం కూడా మిశ్రి పర్యటనలో చర్చకువచ్చే అవకాశం ఉంది. అంతేకాదు.. బంగ్లాదేశ్ దళాలు భారత సరిహద్దుల్లో డ్రోన్ల మోహరింపు తదితర అంశాలపై ఇరు వర్గాలు తమ అభిప్రాయాలను పంచుకొనే అవకాశం ఉంది.

## రెడ్ డ్రెస్‌లో మత్తెక్కిస్తున్న ఇస్మార్ట్ నభా

'నన్ను దోచుకుందువటే' సినిమాతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా అడుగు పెట్టిన ముద్దుగుమ్మ నభా నటేష్. ఈ అమ్మడు తెలుగులో ఆ తర్వాత పలు సినిమాల్లో నటించింది. మొదటి సినిమాతో నటిగా మంచి పేరు సొంతం చేసుకున్న నభా ఆ తర్వాత సినిమాల్లో అందాల ఆరబోత చేయడం ద్వారా గ్లామర్‌తో మెప్పించింది. మొత్తానికి ఈ అమ్మడు టాలీవుడ్‌లో మంచి కమర్షియల్ హీరోయిన్‌గా నిలిచింది. ఈ అమ్మడు పూరి జగన్నాథ్ దర్శకత్వంలో చేసిన ఇస్మార్ట్ శంకర్ భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో మరింతగా పాపులారిటీ సొంతం చేసుకుంది. కానీ కరోనా వల్ల ఆ సినిమా హిట్‌ను నభా క్యాష్ చేసుకుని మరిన్ని ఆఫర్లు దక్కించుకోవడంలో విఫలం అయ్యింది. ఇస్మార్ట్ శంకర్ తర్వాత పెద్దగా సినిమాల్లో కనిపించని నభా నటేష్ మళ్లీ బిజీ అయ్యింది. ప్రస్తుతం ఆమె చేతిలో పలు సినిమాలు ఉన్నాయి. ఈ ఏడాది డార్లింగ్ అనే వెబ్ కంటెంట్‌తో ఓటీటీ ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చిన నభా నటేష్ వచ్చే ఏడాదిలో రెండు మూడు సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే అవకాశాలు



ఉన్నాయి. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ ఈ అమ్మడు సినిమా ప్రయత్నాలు చేస్తూనే ఉంది. రెగ్యులర్‌గా ఈ అమ్మడు అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. మరోసారి తన అందమైన ఫోటోలను నభా షేర్ చేయడంతో వార్తల్లో నిలిచింది. అందాల నభా నటేష్ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రెడ్ డ్రెస్‌లో నభా థైస్ అందాలను చూపిస్తూ క్లీ వేజ్ షో తో మతి పోగొడుతోంది. కవ్వించే ఆ చూపులకు ఎంతటి వారు అయినా మతి పోయి కింద పడిపోవాల్సిందే అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. సోషల్ మీడియాలో మరోసారి ముద్దుగుమ్మ నభా నటేష్ అందాల ఆరబోత ఫోటోలు వైరల్ కావడం జరిగింది. ఇంతటి అందగత్తెకు ఆఫర్లు ఆశించిన స్థాయిలో రాకపోవడం విడ్డూరంగా ఉందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలుగులో ఇప్పటి వరకు నభా నటేష్ నన్ను దోచుకుందువటే, అదుగో, ఇస్మార్ట్ శంకర్, డిస్కో రాజా, సోలో బ్రతుకే సో బెటర్, అల్లుడు అదుర్స్, మ్యాస్ట్రో సినిమాలు చేసింది. ప్రస్తుతం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న స్వయంభూ సినిమాలోనూ నభా నటేష్ హీరోయిన్‌గా నటిస్తోంది. తెలుగులో ఈమెకు నటిగా, అందాల ఆరబోత విషయంలో పాజిటివ్ మార్కులు దక్కాయి. కానీ లక్ కలిసి రాపోవడంతో ఆఫర్లు అంతంత మాత్రంగానే వస్తున్నాయి. ముందు ముందు అయినా ఈ అమ్మడికి మంచి ఆఫర్లు దక్కుతాయా అనేది చూడాలి.

## నాగ చైతన్యకు డార్లింగ్..బేబిలంటే నచ్చవంట!

ఇష్టపడి కొనుక్కున్న కార్లకు..వస్తువులకు ముద్దు పేర్లు పెట్టుకోవడం సహజం. కంపెనీ ఇచ్చిన బ్రాండ్ నేమ్ ని వదిలేసి కొత్త పేర్లతో పిలుచుకోవడం అన్నది చాలా మందికి అలవాటు. కోట్ల రూపాయల విలువ చేసే లగ్జరీ కార్లు కాబట్టి అలా అభిమానంతో నచ్చిన ముద్దు పేరు పెట్టుకుని పిలుచుకుంటారు. అయితే ఇలాంటి వాటికి యువ సామ్రాట్ నాగచైతన్య మాత్రం పూర్తిగా వ్యతిరేకం. కొనుక్కున్న కార్లుకు డార్లింగ్..బేబి అంటూ ముద్దు పేర్లు పెట్టుకుని పిలుచుకోవడం తనకెంత మాత్రం ఇష్టం ఉండదు అన్నాడు. కంపెనీ బ్రాండ్...ఆ సంస్థ పేరే హైగా ఉంటుంది. దానికి కొత్తగా మనం పేరు పెట్టుకోవడం...అయి ఇష్టంతో పేరు మార్చడం వంటివి చేయుడంట. కంపెనీ ఇచ్చిన పేరునే ఇష్టంగా భావించి ముందుకెళ్తానన్నాడు. తన దృష్టిలో అదే హై గా ఉంటుందన్నాడు.



నాగచైతన్య గ్యారేజీలో ఇప్పటికే చాలా బ్రాండెడ్ కార్లు ఉన్నాయి. చైతన్యకు ఆటో మొబైల్స్ అంటే ఆసక్తి ఎక్కువ. కార్, బైక్ రేసింగ్ అంటే ఎక్కువగా ఇంట్రెస్ట్ చూపిస్తుంటాడు. ఇప్పటికే చైతూ వద్ద అనేక లగ్జరీ మోడల్ వెహికల్స్ ఉన్నాయి. ఇటీవలే తనకు ఇష్టమైన రేసింగ్ లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్)లో పోటీపడే హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్ ఫ్రాంచైజీని కొనుగోలు చేశాడు. దీంతో ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ (ఐఆర్ఎఫ్) ఆధ్వర్యంలో జరిగే ఫార్ములా 4లో భాగమయ్యాడు. నిజానికి చైతన్యకు ఫార్ములావన్ అంటే చాలా క్రేజీ. బుల్లెట్ లా దూసుకుపోయే ఈ కారు రేసింగ్ చూసేందుకు ప్రతిసారి సీజన్లలో పాల్గొంటారు. ఇప్పటికే చైతూ వద్ద సూపర్ కార్స్, కొత్త హై రేంజ్ స్పీడ్ మోటార్ సైకిళ్లను తన గ్యారేజీలో పెట్టుకున్నాడు. మార్కెట్ లోకి కొత్త టెక్నాలజీతో ఏ కారు వచ్చినా కొనుగోలు చేయడం అలవాటు. వాటిని టెస్ట్ డ్రైవ్ చేస్తుంటారు. కల్కి సినిమా కోసం నాగ్ అశ్విన్ మహీంద్రా సంస్థతో తయారు చేయించిన కార్లను సైతం చైతన్య టెస్ట్ డ్రైవ్ చేసిన సంగతి తెలిసిందే.




## 2024 సీక్వెల్స్: 3 హిట్లు, 5 ఫట్లు!



టాలీవుడ్ లో ప్రస్తుతం సీక్వెల్స్ ట్రెండ్ నడుస్తోంది. ఏదైనా సినిమా హిట్టయిందంటే చాలు, వెంటనే దానికి కొనసాగింపుగా సీక్వెల్ అనౌన్స్ చేస్తున్నారు. పార్ట్-1 సెట్స్ మీద వుండగానే పార్ట్-2 ప్రకటిస్తున్నారు. ఒకప్పుడు బాలీవుడ్ లో సీక్వెల్స్, ఫ్రాంచైజీలు ఉండేవి. కానీ ఇప్పుడు తెలుగులోనూ ఊపందుకున్నాయి. ఈ ఏడాదిలో ఏకంగా 8 సీక్వెల్ సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. వాటిల్లో 3 బ్లాక్ బస్టర్ హిట్స్ సాధిస్తే, మరో 5 పరాజయం చవిచూశాయి. 2024 మార్చిలో థియేటర్లలోకి వచ్చిన క్రేజీ సీక్వెల్ "టిల్లు స్క్వేర్". రెండేళ్ల కిందట బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ గా నిలిచిన 'డీజే టిల్లు' చిత్రానికి కొనసాగింపుగా రూపొందింది. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన ఈ రొమాంటిక్ క్రైమ్ కామెడీలో అనుపమ పరమేశ్వరన్, నేహా శెట్టి హీరోయిన్లుగా నటించారు.

ఇది రూ. 100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. దీంతో ఈ ఫ్రాంచైజీలో మూడో సినిమాగా 'టిల్లు క్యూబ్' రానుందని మేకర్స్ ప్రకటించారు. ఈ ఏడాది ప్రేక్షకాదరణ పొందిన మరో సీక్వెల్ మూవీ "మత్తు వదలరా 2". ఐదేళ్ల క్రితం వచ్చిన ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చి సక్సెస్ సాధించిన 'మత్తు వదలరా' సినిమాకి రెండో భాగం ఇది. రితేష్ రానా దర్శకత్వం వహించిన ఈ క్రైమ్ కామెడీ చిత్రంలో శ్రీ సింహా, సత్య, ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రలు పోషించారు. ఇది చిన్న సినిమాగా విడుదలై, బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయం అందుకుంది. ముఖ్యంగా ఓవర్ సీస్ లో అనూహ్యమైన వసూళ్లు రాబట్టింది. లేటెస్టుగా థియేటర్లలోకి వచ్చిన అతి పెద్ద సీక్వెల్ "పుష్ప 2: ది రూల్". 'పుష్ప: ది రైజ్' చిత్రానికి సెకండ్ పార్ట్ గా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కింది. అల్లు అర్జున్, రష్మిక మందన్న హీరో హీరోయిన్లుగా నటించారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం.. బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ దిశగా దూసుకుపోతోంది. భారతీయ సినీ చరిత్రలో ఆల్ టైమ్ బిగ్గెస్ట్ ఓపెనర్ గా నిలవడమే కాదు, అత్యంత వేగంగా ?500 కోట్ల క్లబ్ లో చేరిన ఇండియన్ మూవీగా రికార్డ్ క్రియేట్ చేసింది. నార్త్ లో ఈ సీక్వెల్ ప్రభంజనం సృష్టిస్తోంది. దీంతో ఇప్పుడు ఈ చిత్రానికి కొనసాగింపుగా 'పుష్ప 3: ది ర్యాంపేజ్' ను మేకర్స్ ప్రకటించారు.ఇలా ఈ సంవత్సరంలో మూడు సీక్వెల్స్ బాక్సాఫీసు దగ్గర ఘన విజయాలు సాధించాయి. అదే సమయంలో మూడు డిజాస్టర్లు పడ్డాయి. 'ఇస్మార్ట్ శంకర్' సీక్వెల్ గా వచ్చిన "డబుల్ ఇస్మార్ట్" మూవీ పాన్ ఇండియా వైడ్ గా తీవ్ర నిరాశ పరిచింది. పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రామ్ పోతినేని హీరోగా నటించారు. ఇక ఘోర పరాజయం చవిచూసిన మరో సీక్వెల్ "యాత్ర 2". ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బయోపిక్ గా తెరకెక్కిన ఈ చిత్రం.. ఏమాత్రం ప్రభావం చూపించలేకపోతుంది. అలానే 'గీతాంజలి'కి సీక్వెల్ గా 'గీతాంజలి మళ్ళీ వచ్చింది' అనే సినిమా వచ్చింది. అంజలి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం ఫ్లాప్ అయింది. రానా రోహిత్ హీరోగా 'ప్రతినిధి' మూవీకి సీక్వెల్ గా తెరకెక్కిన 'ప్రతినిధి 2' చిత్రం నిరాశ పరిచింది.

ప్రియమణి ప్రధాన పాత్రలో రూపొందిన 'భామాకలాపం 2' సినిమా కూడా ఈ ఏడాదే వచ్చింది. 'భామాకలాపం' ఓటీటీలో మంచి రెస్పాన్స్ తెచ్చుకోగా.. దాని సీక్వెల్ మాత్రం ఆడియన్స్ ను ఆకట్టుకోవడంలో విఫలమైంది. అయితే టాలీవుడ్ లో ఇప్పుడప్పుడే ఈ సీక్వెల్స్ కి బ్రేక్స్ పడేలా కనిపించడం లేదు. రాబోయే రోజుల్లో జై హనుమాన్, హిట్-3, గూఢచారి-2, అఖండ 2: తాండవం, దేవర-2, కల్కి-2, సలార్-2, బింబిసార-2, పొలిమేర-3, పుష్ప-3, డీజే టిల్లు-3, మ్యాడ్ మ్యాక్స్, కార్తికేయ-3, ఆదిత్య 999 మ్యాక్స్, శతమానం భవతి-2, మంగళవారం-2, ఫలక్ నుమా దాస్-2, దాస్ కా ధమ్కీ-2, ఈనగరానికి ఏమైంది-2 వంటి దాదాపు 20 సీక్వల్స్ ప్రకటించబడ్డాయి. వాటిల్లో కొన్ని సినిమాలు వచ్చే ఏడాదే రిలీజ్ కాబోతున్నాయి.

## బాలీవుడ్ కే మాస్ నేర్పిస్తున్న సౌత్!



పక్కా కమర్శియల్ చిత్రాలు చేయడంలో సౌత్ నుంచి అందులోనూ టాలీవుడ్..కోలీవుడ్ నుంచి ప్రొఫెషనల్ డైరెక్టర్లు ఎంతో మంది. సినిమాల ట్రెండ్ మారినా కమర్శియల్ చిత్రాల హవా ఇంకా రీజనల్ మార్కెట్ లో కొనసాగుతుంది అంటే కారణం అలాంటి మేకర్స్ అనడంలో అతిశయోక్తి లేదు. అయితే సౌత్ సినిమా పాన్ ఇండియాలో సంచలనమైన నేపథ్యంలో బాలీవుడ్ హీరోలు ఇక్కడ దర్శకులతో కలిసి పనిచేయడానికి ఎంతో ఆసక్తి చూపి స్తున్నారు. ఒకప్పుడు సౌత్ డైరెక్టర్లు అంటే బాలీవుడ్ కి చిన్న చూపుగా కనిపించేది. కానీ ఇప్పుడా సీన్ మారింది. మాతో కూడా ఓ సినిమా చేయండి ప్లీజ్ అనే పరిస్థితి తలెత్తింది. ఇప్పటికే అట్లీ షారుక్ ఖాన్ తో జవాన్ చేసాడు. సందీప్ రెడ్డి వంగా రాక్ స్టార్ రణబీర్ కపూర్ తో యానిమల్ చేసాడు. ఈ రెండు సినిమాలు ఏ రేంజ్ లో సక్సెస్ అయ్యాయో తెలిసిందే. రెండు చిత్రాల్లోనూ కమర్శియల్ యాంగిల్ పీక్స్ లో ఉంటుంది. బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద కోట్ల వసూళ్ల రాబట్టడంలో ఆ అంశాలు కీలక పాత్ర పోషించాయి. అలాగని కమర్శియల్ చిత్రాలు బాలీవుడ్ కి చేతకాదని కాదు. కానీ సౌత్ మేకర్ల స్థాయిలో మాత్రం నార్త్ మేకర్లు కనెక్ట్ చేయలేరు అన్న విమర్శ చాలా కాలంగా ఉంది. సౌత్ డైరెక్టర్ల సక్సెస్ తీరు చూస్తుంటే ఇది నిజమే కదా అనిపిస్తుంది. ఇటీవల రిలీజ్ అయిన పుష్ప-2 బాలీవుడ్ ని ఏ రేంజ్ లో అల్లాడిస్తుందో తెలిసిందే. ఇది పక్కా కమర్శియల్ చిత్రం. చిత్తూరు ఎర్రచందనం స్టోరీని తీసుకెళ్లి నార్త్ ఆడియన్స్ కి పీక్స్ లో ఎక్కించడంలో సుకుమార్ వందశాతం సక్సెస్ అయ్యారు. అంతకు ముందు సాహోతో సుజిత్ కూడా హిందీ మార్కెట్ లో మంచి వసూళ్లు సాధించడంలో ఆ కమర్శియల్ పంథానే వర్కౌట్ అయింది. ప్రస్తుతం గోపీ చంద్ మలినేని బాలీవుడ్ హీరో సన్నిడియోల్ తో జాట్ అనే సినిమా చేస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా ప్రచార చిత్రాలు చూస్తే సంగతేంటి అన్నది అర్దమవుతుంది. గోపీచంద్ కమర్శియల్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్ లాంటాడు. ఇప్పటివరకూ ఆయన చేసిన సినిమాలన్నీ బాగానే ఆడాయి. అదే కాన్ఫిడెన్స్ తో సన్నిడియోల్‌లో ఛాన్స్ ఇచ్చాడు. అలా సౌత్ మాస్ నార్త్ కి ఎక్కిస్తున్నారు.

## అమ్మకు శ్రీలీల అమ్ములా!

తెలుగు హీరోయిన్ శ్రీలీల గురించి చెప్పాల్సిన పనిలేదు. స్టార్ లీగ్ లో చేరిన నెటి జనరేషన్ తొలి తెలుగు హీరోయిన్. అమ్మడు చాలా వేగంగా స్టార్ హీరోల చిత్రాలకు ప్రమోట్ అయింది. సాధారణంగా తెలుగు అమ్మాయిలకు అవకాశాలు ఇవ్వరు? అనే విమర్శ చాలా కాలంగా ఉంది. దాన్ని శ్రీలీల కాస్త బ్రేక్ చేసినట్లే కనిపిస్తుంది. ప్రస్తుతం అమ్మడి కెరీర్ కి తిరుగు లేదు. శ్రీలీల చలాకీ తనం....ట్యాలెంట్ తో ఇండస్ట్రీలో నెట్టుకొచ్చేస్తుంది. పుష్ప-2లో ఐటం పాటతో పాన్ ఇండియాలోనూ సంచలనం అయింది. ఈ పాట అమ్మడిని పాన్ ఇండియాలోనే ఎనలేని గుర్తింపును తీసుకొచ్చింది. మొదటి భాగంలో సమంత ఊపేస్తే రెండవ భాగంలో శ్రీలీల



ఊపేసింది. ఇకపై బాలీవుడ్ లో అవకాశాలు అందుకునే ఛాన్స్ ఉంది. ఇప్పటికే ఆ రకమైన ప్రయత్నాల్లో ఉంది. ఓ సినిమాలో ఛాన్స్ వచ్చినట్లే వచ్చి చేజారింది. అయినా శ్రీలీల చలాకీతనంతో మరెన్నో అవకాశాలకు ఛాన్స్ ఉంది. ఇక అమ్మడు ఇంట్లో కూడా ఎంతో చలాకీగా ఉంటుంది. అమ్మను ఆట పట్టించడంలో ముందుంటుంది. అమ్మకు శ్రీలీల అంటే మహా గారం లా ఉంది. శ్రీలీలను వాళ్లమ్మ ముద్దుగా అమ్ములు అని పిలుస్తుంది. సాధారణంగా ఇలాంటి పిలుపులు పల్లెటూళ్లలో వినిపిస్తుంటాయి. కానీ సిటీ కల్చర్ లో పెరిగిన అమ్మాయిని ఇలా పిలడంతో? వాళ్లెంత డౌన్ టూ ఎర్త్ అన్నది అద్దం పడుతుంది. తల్లీ-కూతురు డాక్టర్లు. బెంగుళూరులో సొంత ఆసుపత్రులున్నాయి. శ్రీలీల నటి కాకపోయి ఉంటే అమ్మలా డాక్టర్ అయ్యేది. ఇప్పటికే ఆ కోర్సు కూడా పూర్తి చేసింది. కానీ తల్లి కుమార్తెను హీరోయిన్ చేయాలని చిన్ననాటి ప్లాన్ చేసి నటనవైపు అడుగులు పడలా చూసారు. అందుకే శ్రీలీల అంత గొప్ప డాన్సర్ అయింది. నటిగానూ ఆమెకు తిరుగు లేదు.

## బర్త్‌డే పార్టీలో స్టార్ కిడ్స్ రిమ్ జిమ్

నటవారసురాళ్లు సుహానా ఖాన్, అనన్య పాండే స్నేహం గురించి తెలిసిందే. ఒకరు సూపర్ స్టార్ షారూఖ్ ఖాన్ కుమార్తె అయితే, మరొకరు నటుడు చంకీ పాండే కుమార్తె. అయితే వీళ్లతో రెగ్యులర్ గా పార్టీలకు వచ్చే మరో స్టార్ కిడ్ నవ్య నవేలి నంద. ఈ బ్యూటీ అమితాబ్ మనవరాలు(శ్వేతానంద కుమార్తె). క్లబ్ పబ్ లో రెగ్యులర్ గా చిల్ అయ్యే బ్యాచ్ ఇది. వారి మధ్య గొప్ప స్నేహం అన్నివేళలా యువతరం దృష్టిని ఆకర్షిస్తూనే ఉంది. స్పైస్ గర్ల్స్ పేరుతో సోషల్ మీడియాల్లోను వీళ్ల ఫోటోలు ఎక్కువగా వైరల్ అవుతున్నాయి. డిసెంబర్ 7న అనన్య పాండే తన స్నేహితురాళ్లతో కలిసి ఉన్న ఫోటోని ఇన్ స్టాలో షేర్ చేసింది. నవ్య నంద పుట్టినరోజు వేడుకలకు సంబం



ధించిన ఫోటోలు ఇవి. సుహానా .. అనన్య తెలుపు రంగు డిజైనర్ దుస్తుల్లో అందంగా కనిపించగా, బర్త్ డే బేబి నవ్య నవేళి వంగపువ్వు రంగు ఫ్రాకులో ఎంతో ఆకర్షణీయంగా కనిపించింది. ముఖ్యంగా నవ్య నవేళి తన స్నేహితురాళ్లను కలిసిన క్షణాన తన ఆనందాన్ని దాచుకోలేకపోయింది. అన్‌స్టాపబుల్ అనిపించేలా అందమైన నవ్వుతో ఆకర్షించింది. అమితాబ్ బచ్చన్ మనవరాలు నవ్య నవేళి బ్రౌన్ బాడీకాన్ డ్రెస్ బర్త్ డే ఈవెంట్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పార్టీలో సుహానా- నవ్య విపరీతంగా నవ్వుతుండగా, అనన్య తన నాలుకను చిలిపిగా బయటకు పెట్టి ఫోటోకు ఫోజులిచ్చింది. ఈ ఫోటోలపై మరో స్నేహితురాలు షానయా కపూర్ స్పందిస్తూ లవ్ హార్ట్ ఈమోజీని షేర్ చేసింది. అభిమానులు అద్భుతమైన గాల్స్ అంటూ ప్రేమను కురిపిస్తున్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే... అనన్య పాండే తదుపరి సి. శంకరన్ నాయర్ జీవితకథ ఆధారంగా రూపొందుతున్న చిత్రంలో నటిస్తోంది. సుహానా ఖాన్ భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ కింగ్‌షూటింగ్‌ను ప్రారంభించనుంది. ఇందులో షారూఖ్ కీలక పాత్రధారి. నవ్య నంద ఇటీవల ప్రతిష్ఠాత్మక ఐఐఎంలో చదువుతోందని కథనాలొచ్చాయి. తను పారిశ్రామికవేత్తగా ఎదిగేందుకు ప్రయత్నిస్తోంది.




## తెలంగాణ తల్లి అంటే భావన మాత్రమే కాదు.. 4 కోట్ల బిడ్డల భావోద్వేగం: సీఎం రేవంత్

హైదరాబాద్: డిసెంబర్ 9 తెలంగాణకు పర్వదినం అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 2009లో అదే రోజు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ప్రకటన వచ్చిందని గుర్తు చేశారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. ఇక్కడి ప్రజల ఆకాంక్షను సోనియా గాంధీ నెరవేర్చారన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేశారని చెప్పారు.

'నా తెలంగాణ.. కోటి రతనాల వీణ' అన్న దాశరథి మాటలు నిత్యసత్యమని పేర్కొన్నారు. భూ ప్రపంచంలో ఏ జాతికైనా గుర్తింపు.. ఆ జాతి అస్తిత్వమే అని చెప్పారు. అస్తిత్వానికి మూలం సంస్కృతి.. సంస్కృతికి ప్రతిరూపమే తల్లి అని వివరించారు. "స్వరాష్ట్ర పోరాట ప్రస్థానంలో సకల జనులను ఐక్యం చేసింది తెలంగాణ తల్లి. తెలంగాణ జాతి భావనకు జీవం పోసింది. నిరంతరం చైతన్యపరిచి లక్ష్యసాధన వైపు నడిపింది. తెలంగాణ తల్లి స్వరూపానికి అధికారిక గుర్తింపు లేదు. ప్రజాపోరాటాలకు ఊపిరి పోసుకున్న మాతృమూర్తిని గౌరవించుకునేందుకు నిర్ణయించాం. సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ తల్లి అంటే భావన మాత్రమే కాదు.. 4 కోట్ల బిడ్డల భావోద్వేగం. ప్రజల మనోఫలకాల్లో నిలిచిన రూపాన్ని సచివాలయ ప్రాంగణంలో ఆవిష్కరించుకుంటున్నాం. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకుని విగ్రహానికి రూపకల్పన చేశాం. తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనలో సంప్రదాయం, సంస్కృతులను పరిగణనలోకి తీసుకున్నాం. ప్రశాంత వదనంతో సంప్రదాయ కట్టుబొట్టుతో తీర్చిదిద్దాం. గుండుపూసలు, హారం, ముక్కుపుడకను పొందుపర్చాం. ఆకుపచ్చ చీర, కడియాలు, మెట్టెలతో పాటు చాకలి ఐలమ్మ, సమ్మక్క-సారక్క పోరాట స్ఫూర్తితో తెలంగాణ తల్లి రూపకల్పన చేశాం. సంప్రదాయ పంటలైన వరి, జొన్న, సజ్జలు, మొక్కజొన్నలు ఆ తల్లి చేతిలో కనిపించేలా ఏర్పాటు చేశాం. చరిత్రకు దర్పణంగా నిలుచున్న విగ్రహాన్ని రూపొందించాం. ఉద్యమాలు, ఆత్మ బలిదానాలకు సంకేతంగా పీఠంలో పిడికళ్లను పొందుపరిచాం" అని రేవంత్‌రెడ్డి వివరించారు.

## నడిరోడ్డు పైనే మమ్మల్ని అడ్డుకోవడం సమంజసమా?: కేటీఆర్





హైదరాబాద్: సీఎం రేవంత్- అదానీ ఫొటో ముద్రించిన టీషర్టులతో వెళ్లిన తమను అసెంబ్లీలోకి అనుమతించకపోవడంపై భారాస నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. అసెంబ్లీ గేటు వద్ద నిరసన కొనసాగించారు. అదానీ-రేవంత్ బొమ్మ ఉన్న టీషర్టులతోనే లోపలికి వెళ్తామని తేల్చి చెప్పారు.

దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. అంతకుముందు కేటీఆర్ మాట్లాడుతూ పార్లమెంట్‌కు రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ఎంపీలు అదానీ ఫొటో ఉన్న టీషర్టులు ధరించి వెళ్లారన్నారు. "లగచర్ల ప్రజల తరపున నిరసన తెలిపేందుకు సభకు వెళ్తున్నాం. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా రైతుల తరపున పోరాడతాం. నడిరోడ్డుపైనే ఎమ్మెల్యేలను అడ్డుకోవడం సమంజసమా? అదానీకి కాంగ్రెస్ నేతలు దాసోహం అంటున్నారు. అదానీ-రేవంత్ బంధాన్ని బయటపెడతాం. పోలీసులను అడ్డుపెట్టుకొని సభకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. కాంగ్రెస్ నేతలు దిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ కడుతున్నారు. ఆ పార్టీ దుర్మార్గ వైఖరికి వ్యతిరేకంగా అసెంబ్లీలో నిరసన తెలుపుతాం"అని చెప్పారు.

**రాహుల్‌కు ఒక నీతి.. రేవంత్‌కు మరో నీతా?: హరీశ్‌రావు..** హరీశ్‌రావు మాట్లాడుతూ "అదానీ ఫొటో ఉన్న టీషర్టులు ధరించి కాంగ్రెస్ నేతలు పార్లమెంట్‌కు వెళ్లారు. దిల్లీలో రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ నేతలు ఆ టీషర్టులు వేసుకొని వెళ్తే మీకు ఫర్వాలేదు. రాష్ట్రంలో మేం నిరసన తెలుపుతూ టీషర్టులు ధరిస్తే మీకు ఇబ్బందేంటి? రాహుల్‌గాంధీకి ఒక నీతి.. రేవంత్‌రెడ్డికి మరో నీతి ఉంటుందా? కాంగ్రెస్ పార్టీకి ఒక సిద్ధాంతం లేదా? రాష్ట్రంలో దుర్మార్గ, అరాచక పాలన సాగుతోంది. ప్రజలు, ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు యత్నిస్తున్నారు. సభలో ప్రతిపక్షాలు లేకుండా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు చేయాలని ఎవరైనా ఉద్యమాలు చేశారా? కొత్తగా రూపొందించిన విగ్రహంలో బతుకమ్మను తొలగించి చెయ్యి గుర్తు పెట్టారు. అలా చేయడం తెలంగాణ మహిళలను కించపరచడమే. రాష్ట్ర ప్రజలకు ఇది అవమానం. కేసీఆర్‌పై కుట్రతో తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చారు.

## రేవంత్‌రెడ్డి దుశ్చర్యతో తెలంగాణ తల్లి కన్నీళ్లు పెడుతోంది: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: తెలంగాణ తల్లిని కాంగ్రెస్ తల్లిగా మార్చారని భారాస ఎమ్మెల్సీ కవిత విమర్శించారు.

సీఎం రేవంత్‌రెడ్డి దుశ్చర్యతో తెలంగాణ తల్లి కన్నీళ్లు పెడుతోందని మండిపడ్డారు. విగ్రహం నుంచి బతుకమ్మను మాయం చేశారని.. తెలంగాణ ప్రత్యేకత లేకుండా చేశారని చెప్పారు. ఆమెకు నివాళులర్పించే అర్హత రేవంత్‌రెడ్డికి లేదని కవిత పేర్కొన్నారు.

## తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాజకీయం చేస్తే చరిత్ర క్షమించదు: కూనంనేని



హైదరాబాద్: సభలో భారాస సభ్యులు ఉంటే బాగుండేదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. భారాస కోరుకున్నట్లు తెలంగాణ తల్లి రూపం ఉండదన్నారు. కవులు, కళాకారులు, మేధావుల సలహాలు, సూచనల మేరకు రూపొందించినట్లు చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనపై ఎమ్మెల్యేల అభిప్రాయం తీసుకుని ఉంటే బాగుండేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఒక్కొక్కరూ ఒక్కో పాత్ర పోషించారని చెప్పారు. రాజకీయ కోణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని వివాదం చేస్తే చరిత్ర క్షమించదని వ్యాఖ్యానించారు.

"తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొనాలి. ఈ అంశంపై ఏకాభిప్రాయంతో ఉన్నామని చాటి చెప్పాల్సిన అవసరం ఉంది. తెరాసను భారాసగా మార్చుకోవచ్చు.. తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా రూపకల్పన చేస్తే తప్పు జరిగినట్లా?తెలంగాణ తల్లి విగ్రహం కన్నతల్లిలా ఉండాలనేదే ఉద్దేశం" అని కూనంనేని సాంబశివరావు అన్నారు.

## ఆప్ రెండో జాబితా విడుదల.. ఆ కోచ్ కోసం సిసోదియా త్యాగం

దిల్లీ: వచ్చే ఏడాది ప్రారంభంలో దిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈనేపథ్యంలో ఇప్పటికే తొలి జాబితాను విడుదల చేసిన అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ తాజాగా తమ అభ్యర్థుల రెండో జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియా పేరు ప్రకటించారు. అయితే ఆయన ఎప్పుడూ పోటీ చేసే పటపథ్ గంజ్ స్థానం నుంచి కాకుండా జంగ్‌పురా నుంచి పోటీ చేయడం గమనార్హం. ఎన్నోఏళ్లుగా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ స్థానం నుంచి ఇటీవల ఆప్‌లో చేరిన ప్రముఖ యూపీఎస్సీ కోచ్ అవధ్ ఓజా పోటీ చేయనున్నారు. మనీలాండరింగ్‌తో ముడిపడిన దిల్లీ మద్యం కుంభకోణం కేసులో 17 నెలలుగా తిహాడ్ జైలులో ఉన్న సిసోదియా ఆగస్టులో విడుదలయ్యారు. ఇదిలాఉంటే.. మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొని.. జైలుకు వెళ్లి వచ్చిన ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రజలు మళ్లీ తనకు విశ్వసనీయత సర్టిఫికెట్ ఇచ్చేవరకూ సీఎం పదవిలో ఉండబోనని కొన్ని నెలల క్రితం ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి, రానున్న ఎన్నికల కోసం పార్టీని ముందుకునడిపిస్తున్నారు. ఆప్ నేత ఆతిశీ దిల్లీకి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా దిల్లీ మంత్రిగా పనిచేసిన కైలాశ్ గహ్లోత్ ఇటీవల భాజపాలో చేరిన విషయం తెలిసిందే.




## చెన్నమనేని రమేశ్ జర్మనీ పౌరుడే.. తేల్చిచెప్పిన హైకోర్టు

హైదరాబాద్: వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌కు తెలంగాణ హైకోర్టులో షాక్ తగిలింది. పౌరసత్వం కేసులో దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. చెన్నమనేని రమేశ్ జర్మనీ పౌరుడేనని హైకోర్టు తేల్చిచెప్పింది.

జర్మనీ పౌరుడిగా ఉంటూ ఎమ్మెల్యేగా గెలిచారని.. తప్పుడు డాక్యుమెంట్లతో గత 15 ఏళ్లుగా కోర్టును తప్పుదోవ పట్టించారని ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఆయనకు రూ.30లక్షల జరిమానా విధించింది. నెలలోపు చెల్లించాలని స్పష్టం చేసింది. దీనిలో రూ.25లక్షలు ప్రస్తుత ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు, రూ.5లక్షలు లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది.

తప్పుడు సమాచారంతో ఎన్నికల్లో పోటీ చేశారంటూ కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న ఆది శ్రీనివాస్ గతంలో చెన్నమనేని రమేశ్‌కు వ్యతిరేకంగా ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.




## సోనియా గాంధీ లేకుంటే మరో జన్మలోనూ తెలంగాణ వచ్చేది కాదు: కోమటిరెడ్డి

హైదరాబాద్: సోనియా గాంధీ లేకుంటే మరో జన్మలో కూడా తెలంగాణ వచ్చేది కాదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు.

ఇది తెలంగాణ రాష్ట్ర ప్రకటన రోజు.. నాలుగు కోట్ల ప్రజల కోరిక తీరిన రోజు అని అభివర్ణించారు. ఈ విషయాన్ని సభలో ప్రతిపక్ష నేత గతంలో స్వయంగా ప్రకటించారని గుర్తుచేశారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రోజున ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. గత పదేళ్లలో నీళ్లు, నిధులు, నియామకాలు ఏమీ రాలేదని చెప్పారు. అమ్మలాంటి తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకుంటున్న ఈరోజు.. సభకు వచ్చి శుభాకాంక్షలు చెప్పేది పోయి.. బయట నిరసనలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

**కేంద్రం నుంచి నిధుల సాధనకు అందరం కృషి చేయాలి: మంత్రి పొన్నం...** తెలంగాణ రావడానికి కారణం సోనియాగాంధీ అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ చిహ్నంలో మార్పు జరగలేదన్నారు. తెలంగాణ గీతాన్ని రూపొందించి అధికారికంగా ఉపయోగిస్తున్నట్లు వివరించారు. గతంలో ఉన్న విగ్రహాలు పార్టీకి సంబంధించినవని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం ప్రభుత్వపరంగా లేదని పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేస్తున్నామని.. రాష్ట్ర ప్రజల భావోద్వేగాలకు అనుగుణంగా రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఇటీవల వరదలు వస్తే కేంద్రం కేవలం రూ.400 కోట్లు ఇచ్చిందని విమర్శించారు. కేంద్రం నుంచి నిధుల సాధనకు అందరం కృషి చేయాలని పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## గత పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ఆవిష్కరించారా?: మంత్రి సీతక్క



హైదరాబాద్: సొంత అజెండాతో తెలంగాణ తల్లి విగ్రహం చుట్టూ రాజకీయాలు చేస్తున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. తమ ప్రభుత్వం రూపొందించిన విగ్రహంలో రాష్ట్ర ప్రజల అస్తిత్వం, ఆత్మగౌరవం, పోరాటం, శ్రమైక జీవనరూపం, ఆశీర్వాదం కలగలిసిన నిండైన రూపముందని చెప్పారు. శాసనసభలో సీతక్క మాట్లాడారు. "తెలంగాణ తల్లి విగ్రహాన్ని మారుస్తున్నామంటూ భారాస, భాజపా నేతలు మాపై విమర్శలు చేస్తున్నారు. గత పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎక్కడైనా అధికారికంగా ఆవిష్కరించారా? కేటీఆర్ సోదరికి దేవతా విగ్రహ రూపాన్ని ఇస్తే ఎలా ఉంటుందో అలా పెట్టుకొని దాన్ని రాష్ట్ర ప్రజలపై రుద్దారు. నేడు మేం తెలంగాణ బిడ్డల అస్తిత్వానికి అనుగుణంగా ఉండేలా విగ్రహాన్ని రూపొందించాం. గుండెల నిండా పాడుకునే 'జయజయహే తెలంగాణ' పాటను రాష్ట్ర గీతంగా ఏర్పాటు చేయాలనే ఆలోచన గత పాలకులకు రాలేదు. నేడు మేం చేస్తుంటే అడ్డుకుంటున్నారు. ఉద్యమ సమయంలో టీజీ అని.. అధికారంలోకి వచ్చాక టీఎస్ అని మార్చారు. అప్పుడు భాజపా మాట్లాడలేదు. పార్టీ పేరులో తెలంగాణ పదాన్ని తొలగించారు. ఇప్పుడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పెట్టిన విగ్రహాన్ని చూస్తుంటే మా అక్కాచెల్లెళ్లను చూసినట్లే ఉంది. తెలంగాణ మహిళలు మట్టి బిడ్డలు.. ఆ శ్రామిక తత్వానికి ప్రతిరూపంగా రూపొందించాం" అని సీతక్క అన్నారు.

## కాంగ్రెస్ పార్టీ తల్లి విగ్రహావిష్కరణ జరుగుతుంది.. ఎమ్మెల్సీ వాణిదేవి సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ : ఈరోజు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కాదు.. కాంగ్రెస్ పార్టీ తల్లి విగ్రహావిష్కరణ జరుగుతుంది అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వాణిదేవి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీ వాణిదేవీ తెలంగాణ భవన్‌లో మాట్లాడారు. తెలంగాణ తల్లి మన అస్తిత్వం చాటేలా ఉండాలి, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మిస్తున్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ అలా లేదు. బీదగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారు... బీదగా ఉండాలని ఎవరు కొరుకోరు. ఉద్యమ సమయంలో తెలంగాణ తల్లిని చూడగానే దండం పెట్టుకునేలా శిల్పి రూపొందించారు అని వాణిదేవీ గుర్తు చేశారు. శిల్పా శాస్త్రం ప్రకారం ఉండాల్సిన లక్షణాలు అన్నీ కేసీఆర్ హయాంలో రూపొందిన విగ్రహంలో ఉన్నాయి. బీదరికం ఉట్టిపడేలా తెలంగాణ తల్లి ఉండాలా..? కోహినూరు వజ్రం లభించిన ఈ నేలలో తెలంగాణ తల్లికి కిరీటం ఉండకూడదా..? తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ.. తెలంగాణ తల్లికి రత్నాలు ఉండకూడదా..? కేసీఆర్ మీద అక్కసుతోనే తెలంగాణ విగ్రహం మార్చారు. బతుకమ్మ లేకుండా తెలంగాణ తల్లా..?. బతుకమ్మ లేకుండా తెలంగాణ తల్లి విగ్రహం ఉండడం అంటే మహిళను అవమానించడమే. ఇది తెలంగాణ తల్లి విగ్రహం కాదు.. కాంగ్రెస్ పార్టీ తల్లి విగ్రహం అని వాణిదేవీ పేర్కొన్నారు.

## జగన్ లాగా చేయడం ఎవరికి సాధ్యం కాదు.. మంత్రి అనగాని సత్యప్రసాద్ విసుర్లు

అమరావతి: వైసీపీ హయాంలో విద్యార్థులు, ఉపాధ్యాయులపై మోయలేని భారాన్ని పెట్టి విద్యా వ్యవస్థను నాశనం చేశారని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. జగన్ కన్నా మహానటుడు ఎవరున్నారుని ప్రశ్నించారు. పదే పదే అబద్దాలు చెప్పడంతోపాటు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టి కూడా ప్రజా రక్షకుడిగా ఫోజు పెట్టడం జగన్ లాగా ఎవరికైనా సాధ్యమవుతుందా అని నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు హత్యలు, దాడులు, అక్రమ కేసులతో అరాచకపాలన సాగించి ఇప్పుడేమో ఏమీ జరగక్కున్నా మొసలి కన్నీరు కార్చడం ఆయనకు మాత్రమే సరిపోతుందని ఎద్దేవా చేశారు. విద్యా వ్యవస్థను దారిలో పెట్టి రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా మార్చేందుకు చంద్రబాబు చేస్తున్న శ్రమను జగన్ నటన అంటుంటే ప్రజలంతా ఆయనను ఛీదరించుకుంటున్నారని అన్నారు. ఆయన చేతకాని తనం వల్లే పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతాలు ఘోరంగా పడిపోయాయని చెప్పారు. గాడితప్పిన విద్యా వ్యవస్థను యువ నేత నారా లోకేష్ అహర్నిషలు కష్టపడి దారిలో పెడుతుంటే చూసి సహించలేక పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా నటించడం మానేసి కూటమి ప్రభుత్వం మాదిరిగా ప్రజల సంక్షేమం కోసం పాటుపడటం జగన్ రెడ్డి నేర్చుకోవాలని అన్నారు. లేకుంటే ఇప్పటికి లెవెన్ రెడ్డిగా ఉన్న పెద్ద జీరో రెడ్డిగా మారిపోతావు...తస్మాస్ జాగ్రత అని హెచ్చరించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com